
మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

## ఆసియా నీటి పక్షుల గణన



గుర్తించిన ఆసియా నీటి పక్షులు



ఆసియా నీటి పక్షుల గణన నిర్వహిస్తున్న అధికారులు

**బిజినేపల్లి, జనవరి 28 ప్రభాతవార్త:** అమ్రాబాద్ టైగర్ రిజర్వ్, హైదరాబాద్ టైగర్ కన్జర్వేషన్ సొసైటీ సంయుక్తంగా నాగర్‌కర్నూల్ రేంజ్‌లోని గంగారం రిజర్వ్ ఫారెస్ట్‌లోని కర్ణం కుంట సోలార్ ట్యాంక్‌లో 2026 ఆసియా నీటి పక్షుల గణనను బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జీవశాస్త్రజ్ఞులు సిబ్బంది 52రకాల పక్షిజాతులు భూసంబం ధమైన నీటి పక్షులకు చెందినవని గుర్తించినట్లు వివరించారు. ప్రధాన పక్షిజాతులు ఓపెన్ బిల్ కొంగ, పెయింటెడ్ కొంగ, గ్రే హెరాన్, ఎగ్రెట్స్, పర్పుల్ హెరాన్ తోపాటు అనేక ఇతర జాతులు గుర్తించడం జరిగిందన్నారు. ఈ సర్వే ద్వారా వివిధ వలస పక్షుల రాక, స్థానిక జాతుల సంఖ్య, వాటి గూడు ప్రదేశాలు, ఆహార వనరులు మరియు నివాస పరిస్థితులపై విలువైన సమాచారం సేకరించబడింది అన్నారు. పక్షుల వైవిధ్యం పర్యావరణ సమతుల్య తకు సూచికగా నిలుస్తుందని అధికారులు తెలిపారు. ఈ లెక్కింపు ఫలితాలు భవిష్యత్ సంరక్షణ చర్యలు, నివాస ప్రదేశాల పరిరక్షణ, జీవ వైవిధ్య పరిరక్షణకు మార్గదర్శకంగా ఉపయోగపడనున్నాయనారు. ఈ యొక్క పక్షుల డాటాను ఈ బర్డ్ అప్లికేషన్లో నిక్షిప్తం చేయడం జరిగిందని. ఈసర్వేలో నాగర్‌కర్నూల్ రేంజ్ అధికారి దేవరాజ్, సెక్షన్ ఆఫీసర్ చంటి, రవికాంత్ బయాలజీస్టు, హైదరాబాద్ టైగర్ కన్జర్వేషన్ సొసైటీ నల్లమల్ల ల్యాండ్ స్కేప్ కోఆర్డినేటర్ బాపురెడ్డి పాల్గొన్నారు.

---

### నామినేషన్ కేంద్రాల్లో

## ఇబ్బందులు రానీయొద్దు

**మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేంద్ర బోయి**

**సాధారణ ఎన్నికల పరిశీలకురాలు కాత్యాయని దేవితో**

**కలిసి నామినేషన్ కేంద్రాల సందర్శన**



నామినేషన్ కేంద్రాన్ని సందర్శిస్తున్న కలెక్టర్, ఎన్నికల పరిశీలకురాలు

**మహబూబ్‌నగర్, జనవరి 28 ప్రభాతవార్త:** మున్సిపల్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అధికారులకు సూచించారు. బుధవారం వమహబూబ్‌నగర్ పాలక సంస్థ కార్యాలయంలో నామినేషన్ ప్రక్రియ ఏర్పాట్లను జిల్లాకలెక్టర్ విజయేందిర బోయి, సాధారణ ఎన్నికల పరిశీలకురాలు కాత్యాయని దేవి తోకలిసి నామినేషన్ల ప్రక్రియను పరిశీలించారు. నామినేషన్లు దాఖలు చేయుటకు పోటీ చేసే అభ్యర్థులకు ఎలాంటి లోటుపాట్లు జరగకుండా చూడాలని అధికారులకు సూచించారు. నామినేషన్లు స్వీకరించే సమయంలో అభ్యర్థులు ఏఏ ధ్రువీకరణ పత్రాలు జత చేయాలో చెక్ లిస్ట్ స్పష్టంగా తెలిసేలా ప్రదర్శించాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. హెల్ప్‌డెస్క్ ఏర్పాటుచేయాలని, ఏమైనా సందేహాలుఉంటే నివృత్తి చేయాలని సూచించారు. ఫ్రీ సింబల్స్‌ను ప్రదర్శించాలని సూచించారు. కలెక్టర్ నామినేషన్ల ప్రక్రియపరిశీలనలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, నగరపాలక సంస్థ కమిషనర్ రామానుజులరెడ్డి, రిటర్నింగ్, అసిస్టెంట్, వార్డు అధికారులు ఉన్నారు.

---

### పురపాలికల్లో నామినేషన్లు

## సజావుగా ప్రారంభం

**నామినేషన్ల ప్రక్రియ నియమ నిబంధనల ప్రకారం కొనసాగించాలి**

**అధికారులను ఆదేశించిన జిల్లా ఎన్నికల అథారిటీ ఆదర్శ్ సురభి**



మౌలిక వసతుల ఏర్పాట్లను తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్

**వనపర్తి, జనవరి 28 ప్రభాతవార్త :** పురపాలిక ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ షెడ్యూల్ విడుదల చేయడంతో బుధవారం ఉదయం పదిన్నర గంటల నుంచి వనపర్తి జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం అయ్యింది. జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అథారిటీ ఆదర్శ్ సురభి బుధవారం ఉదయం 10.15 గంటలకే వనపర్తి మున్సిపాలిటీ కార్యాలయం చేరుకొని నామినేష్ల ప్రక్రియకు ఏర్పాటు చేసిన మౌలిక వసతులను, ఏర్పాట్లను పరిశీలించారు. నామినేషన్లు వేయడానికి వచ్చే అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయడం, నమూనా నామినేషన్ పత్రాలు అందుబాటులో ఉంచడం, అభ్యర్థి పేరు తన ఓటరు జాబితాలో ఎపిక్ నెంబర్, పార్టు నెంబర్ చూసుకోడానికి -మిగతా4లో..

---

### మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల

## స్వీకరణకు పూర్తి ఏర్పాట్లు

**నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్**



నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని

సందర్శించి అక్కడి ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్

**నారాయణపేట, జనవరి 28 ప్రభాతవార్త :** మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయడానికి వచ్చే సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా అధికారులు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సిక్తా పట్నాయక్ ఆదేశించారు. నారాయణపేట పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ల స్వీకరణ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. నామినేషన్ కౌంటర్లు, హెల్ప్‌డెస్క్, భద్రతా ఏర్పాట్లు, మౌలిక -మిగతా4లో..

---

### తొలి రోజు

# 103నామినేషన్లు..



మహబూబ్ నగర్ కార్పొరేషన్ 49వ డివిజన్ కాంగ్రెస్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న ప్రసన్న ఆనంద్ కుమార్ గౌడ్

- ఉమ్మడి జిల్లాలో ఒక కార్పొరేషన్,
- 18 మున్సిపాలిటీల్లో
- నామినేషన్ల స్వీకరణ
- నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతం
- పర్యవేక్షించిన ఆయా జిల్లాల
- ఎన్నికల అధికారులు, కలెక్టర్లు, ఎస్పీలు

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 28 ప్రభాతవార్త :** మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ షురూ అయింది. ఇందులో భాగంగా ఇవాళ్టి నుంచి నామినేషన్లను స్వీకరిస్తున్నారు. జనవరి 30వ తేదీతో ఈ గడువు పూర్తవుతుంది. ఫిబ్రవరి 11వ తేదీన పోలింగ్ ఉంటుంది. మరోవైపు ఫిబ్రవరి 3 వరకు ఉపసంహరణకు గడువు ఇచ్చారు. ఫిబ్రవరి 11న పోలింగ్ నిర్వహిస్తారు. ఫిబ్రవరి 13న ఫలితాలు వెల్లడించనున్నారు. ఉమ్మడి వ్యాప్తంగా ఒక కార్పొరేషన్, 18 మున్సిపాలిటీలకు ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే. ఆయా జిల్లాల్లో ఎస్పీల ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు మధ్య నామినేషన్ల ప్రక్రియ మొదలైంది. ఎలాంటి ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. నామినేషన్లు వేసే అభ్యర్థులు అర్హతలతో పాటు సంబంధిత పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి స్వీకరిస్తున్నారు. మహబూబ్‌నగర్లో కలెక్టర్ విజయేంద్ర బోయి, ఎన్నికల పరిశీలకురాలు కాత్యాయని దేవి, ఎస్పీ జానకి ధరావత్ నామినేషన్ కేంద్రాలను సందర్శించి పకడ్బందీగా ఎన్నికలు నిర్వహించేందుకు పలు సూచనలు సలహాలు అందించారు. మహబూబ్‌నగర్ జిల్లాలో మూడు మున్సిపాల్టీలు 82 వార్డులు ఉండగా తొలిరోజు 14 నామినేషన్లు దాఖలయ్యాయి. అందులో మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ 9, దేవరకద్ర మున్సిపాల్టీ 4, భూత్పూర్ మున్సిపాలిటీ 1 చొప్పున నామినేషన్లు దాఖలయ్యాయి. నాగర్ కర్నూల్ లో జిల్లాలో.. నాగర్ కర్నూలు జిల్లాలో మూడు మున్సిపాలిటీలకు గాను తొలిరోజు 32 నామినేషన్లు దాఖలు అయ్యాయి. కొల్లాపూర్ లో 7, కల్వకుర్తి లో 14, నాగర్ కుర్నూల్ లో 11 నామినేషన్లు దాఖలు అయినట్లు అధికారులు తెలిపారు. వనపర్తి జిల్లాలో 34 నామినేషన్లు..వనపర్తి జిల్లా లోని ఐదు మున్సిపాలిటీలకు సంబంధించి 80 వార్డులు ఉండగా వాటిలో బుదవారం మొదటి రోజు 34 నామినేషన్లు దాఖలు అయినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. 5 మున్సిపాలిటీలలో అమరచింత 0 ,ఆత్మకూర్ 4, కొత్తకోట 4, పెబ్బేరు 1, అత్యధికంగా వనపర్తి 25 నామినేషన్లు దాఖలైనట్లు వారు తెలిపారు. గద్వాల జిల్లాలో నాలుగు మున్సిపాలిటీలు 77 వార్డులకు గాను ఐదు నామినేషన్లు దాఖలు అయ్యాయి. అయిజ 1, గద్వాల1, అలంపూర్ 2, వడ్డేపల్లి 1 నామినేషన్లు దాఖలు అయ్యాయి. నారాయణపేట జిల్లాలో 18 దాఖలు..మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో నారాయణపేట జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల పరిధిలో మొత్తం 72 వార్డులు ఉండగా, తొలి రోజు మొత్తం 18 నామినేషన్లు దాఖలైనట్లు అధికారులు వెల్లడించారు. మద్దూర్ 1, నారాయణపేట 2, మక్తల్ 4, కోస్గి 12 నామినేషన్లు దాఖలయ్యాయి.

**తొలి రోజు జిల్లాల వారీగా నామినేషన్ల వివరాలు...**

| జిల్లా | మున్సిపాలిటీలు | నామినేషన్లు |
|---|---|---|
| మహబూబ్‌నగర్ | 3 | 14 |
| నాగర్‌కర్నూల్ | 3 | 32 |
| వనపర్తి | 5 | 34 |
| జోగులాంబ గద్వాల | 4 | 05 |
| నారాయణపేట | 4 | 18 |
| **మొత్తం** | **19** | **103** |

---

## కాంగ్రెస్ పార్టీ ఓట్ల కోసం వస్తే తరిమి కొట్టండి

**అమలుకు సాధ్యం కానీ హామీలతో**

**అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి...!**

**వనపర్తి మున్సిపాలిటీలో**

**బిజెపి జెండా ఎగరడం ఖాయం**

**మాజీ శాసనసభ్యులు గువ్వల బాలరాజు**

**జిల్లా అధ్యక్షులు డి.నారాయణ**



నామినేషన్ ముందు సమావేశంలో మాట్లాడుతున్న గువ్వల బాలరాజు

**వనపర్తి, జనవరి 28 ప్రభాతవార్త :** హామీలు అమలు చేయని కాంగ్రెస్ పార్టీ ఓట్లు అడగడానికి వస్తే తరిమి కొట్టండి అని మాజీ శాసనసభ్యులు గువ్వల బాలరాజు పిలుపునిచ్చారు. ఈ మేరకు వనపర్తి మున్సిపాలిటీలో బిజెపి రాష్ట్ర నాయకులు మాజీ శాసనసభ్యులు గువ్వల బాలరాజు పర్యటించడం జరిగింది. వనపర్తి మున్సిపాలిటీ 13వ వార్డులో కొండోజు గోపీనాథ్ నామినేషన్ సందర్భంగా పెద్ద ఎత్తున స్వచ్ఛందంగా తరలివచ్చిన మహిళల ఉద్దేశించి మాజీ శాసనసభ్యులు గువ్వల బాలరాజు మాట్లాడారు. అబద్ధపు గ్యారంటీలు అమలుకు సాధ్యం కానీ హామీలతో అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీలకు ఒక్క రూపాయి నిధులు ఇవ్వలేని నిస్సహాయ పరిస్థితుల్లో ఉన్నాడని ఎన్నికల ముందు లంకె బిందెలు ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని ప్రగల్ బాలు పలికి నేడు నా బట్టలిప్పి కొట్టిన రూపాయి అప్పు పుట్టడం లేదు బ్యాంకుల ముందుకు వెళితే చెప్పులు ఎత్తుకుపోయే దొంగల్లా చూస్తున్నారని పాలనను చేతులెత్తేశాడని, గ్రామ పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రూ.3500 కోట్ల నిధుల కోసమే తాజాగా గ్రామపంచాయతీ ఎన్నికలు జరిపించారని ఇప్పుడు కూడా అర్బన్ లోకల్ బాడీలకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధుల కోసమే హడావిడిగా నిన్న నోటిఫికేషన్ వచ్చి నేడే నామినేషన్ అనడం అనుమానాలకు దారితీస్తుందని ఏది ఏమైనా గ్రామపంచాయతీలు మున్సిపాలిటీలకు కేంద్రం ఇస్తే తప్ప ఒక్క రూపాయి నిధులు కూడా రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వలేదని విమర్శిస్తూ గత మున్సిపల్ ఎన్నికల్లో 13వ వార్డులో స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందిన మధుసూదన్ రెడ్డి తనకు అనుకూలంగా రిజర్వేషన్ రాకపోయినా బీసీ సోదరుని కోసం ముందుండి గెలిపించడానికి ప్రతిన బూనడం అంటే బిజెపి పార్టీకే ఇది సాధ్యమని ఫిబ్రవరి 11న జరిగే ఎన్నికల్లో వనపర్తి మున్సిపాలిటీలో బిజెపి జెండా ఎగురవేయబోతుందని సర్వేలు చెబుతున్నాయని విజ్ఞులైన వనపర్తి ప్రజలంతా బిజెపికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి మద్దతుగా కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి పెద్ద మెజార్టీతో బిజెపి అభ్యర్థులను -మిగతా4లో..

---

## రాజకీయ పార్టీల సహకారంతో పకడ్బందీ ఎన్నికల నిర్వహణ

**మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలు, - జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బాదావత్ సంతోష్**



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 28 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లాలో 3 మున్సిపాలిటీల్లో జరగనున్న ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు రాజకీయ ప్రతినిధులు తమ వంతు సహకారం అందించాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ కోరారు. బుధవారం నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో మున్సిపల్ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో అదనపు కలెక్టర్ దేవ సహాయం, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ బాదావత్ సంతోష్ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రాష్ట్రంలోని మున్సిపాలిటీలు మున్సిపల్ కార్పొరేషన్లకు సాధారణ ఎన్నికలు 2026 నిర్వహించేందుకు మంగళవారం ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించడం జరిగిందని ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ వివరించారు. జిల్లా ఎన్నికల అధికారి బాదావత్ సంతోష్ మాట్లాడుతూ జిల్లాలో 3 మున్సిపాలిటీల్లో పరిధిలో ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుండి ఈ మేరకు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ తక్షణమే అమల్లోకి వచ్చినట్లు తెలియజేయడమైనది. ఎన్నికల షెడ్యూల్ వివరాలను, వెల్లడిస్తూ నామినేషన్ల స్వీకరణ ప్రారంభ తేదీ: 28.01.2026 (బుధవారం) (ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు) నామినేషన్ల దాఖలు, చివరి తేదీ: 30.01.2026 (శుక్రవారం) (సాయంత్రం 5.00 గంటల వరకు), నామినేషన్ల పరిశీలన తేదీ: 31.01.2026 (శనివారం) (ఉదయం 11.00 గంటల నుండి) చెల్లుబాటు అయ్యే అభ్యర్థుల జాబితా ప్రచురణ : 31.01.2026 (శనివారం) (పరిశీలన పూర్తయిన వెంటనే), అప్పీల్ దాఖలు చేసుకునే చివరి తేదీ: 01.02.2026 (ఆదివారం) (సాయంత్రం 5.00 గంటల వరకు), అప్పీల్స్ పరిష్కార తేదీ: 02.02.2026 ( సోమవారం) (సాయంత్రం 5.00 గంటలకు ముందు)నామినేషన్ ఉపసంహరణకు చివరి తేదీ: 03.02.2026 ( మంగళవారం) (మధ్యాహ్నం 3.00 గంటల వరకు) తుది అభ్యర్థుల జాబితా ప్రచురణ: 03.02.2026 (మంగళవారం) (మధ్యాహ్నం 3.00 గంటల తర్వాత) పోలింగ్ తేదీ: 11.02.2026 (బుధవారం) (ఉదయం 7.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు) రీపోల్ (ఉండినట్లయితే): 12.02.2026 (గురువారం) ఓట్ల లెక్కింపు తేదీ: 13.02.2026 (శుక్రవారం) (ఉదయం 8.00 గంటల నుండి ) ఫలితాల ప్రకటన: ఓట్ల లెక్కింపు పూర్తయిన వెంటనే పార్టీ తరఫున పోటీ చేసే అభ్యర్థులు తప్పనిసరిగా నామినేషన్ పత్రాల్లో పార్టీ పేరు విధిగా రాయాలని, పార్టీల తరఫున బీఫామ్ అందజేసే వ్యక్తి పేరుతో రాష్ట్ర పార్టీ తరఫున అందజేసిన ధ్రువీకరించిన పత్రాన్ని ఈనెల 30వ తేదీల్లోగా జిల్లా కలెక్టర్ అందజేయాలని కలెక్టర్ సూచించారు. పోటీ చేసే అభ్యర్థులు ఎస్సీ ఎస్టీ అయితే నామినేషన్లకు ఎస్సీ ఎస్టీ అభ్యర్థులు 1250 రూపాయలు, ఓసి అభ్యర్థులకు 2500 చెల్లించాల్సి ఉంటుందని అదేవిధంగా ప్రతి అభ్యర్థి లక్ష రూపాయల వరకు మాత్రమే ఎన్నికల్లో ఖర్చు చేయాల్సి ఉంటుందని అభ్యర్థులు తప్పనిసరిగా నూతన అకౌంటును ఓపెన్ చేసుకోవాలని కలెక్టర్ కోరారుఎన్నికల ప్రక్రియను పూర్తిగా నిబంధనల ప్రకారం ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, అధికారులు మరియు ప్రజలు సంపూర్ణ సహకారం అందించాలని అధికారులు కోరారు. ఎన్నికలు పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించి విజయవంతం చేయాలని తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సంబంధిత మున్సిపాలిటీలకు మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ తక్షణమే అమల్లోకి వచ్చిందన్నారు. ఎంసీసీ అమలులో ఉన్న కాలంలో ఎలాంటి ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలకు తావు లేకుండా అన్ని రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఎన్నికల నియమాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. అలాగే పట్టణ పరిధిలో ఉన్న అన్ని రాజకీయ బ్యానర్లు, ఫ్లెక్సీలు, పోస్టర్లు, ఫోటోలు తదితర అభ్యంతరకర ప్రచార సామగ్రిని తొలగించాలని నిన్న సాయంత్రం ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ప్రతినిధిగా డేవిడ్ రాజు, బీఆర్ఎస్ పార్టీ తరఫున శ్రీశైలం, నరసింహా, బిజెపి పార్టీ తరఫున సుధాకర్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, బీఎస్పీ పార్టీ తరఫున రామకృష్ణ, వైయస్సార్ పార్టీ తరఫున ఎండి హుస్సేన్, టిడిపి పార్టీ తరఫున బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

---



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ బి.నాగార్జున, ఎస్ఐ కృష్ణదేవ

## గంజాయి పట్టివేత..

- ఇద్దరు ఒడిస్సా వ్యక్తుల అరెస్ట్,రిమాండ్
- మాదక ద్రవ్యాల విక్రయాలు చేపడితే కఠిన చర్యలు
- కల్వకుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.నాగార్జున

**కల్వకుర్తి, జనవరి 28 ప్రభాతవార్త:** మాదక ద్రవ్యాలు విక్రయాలు చేసిన, రవాణా చేస్తే చట్టరీత్య కఠిన చర్యలు తప్పవని కల్వకుర్తి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి. నాగార్జున హెచ్చరించారు. మాదక ద్రవ్యాల విషయంలో ఎంతటి వారినైనా ఊపేక్షించేది లేదని, గంజాయి లాంటి వ్యసనాలకు సహకరించే వారిపై ఉక్కుపాదం మోపుతామన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్పీ డా.సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లాలో మాదక ద్రవ్యాల నిర్మూలనకు చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో భాగంగా ఊర్కొండ పోలీసులు భారీగా గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఊర్కొండ మండలంలో ఇద్దరు నిందితులను పట్టుకొని వారి నుంచి గంజాయి స్వాధీనపర్చుకున్నట్లు సీఐ పేర్కొన్నారు. బుధవారం సీఐ బి. నాగర్జున మాట్లాడుతూ ఊర్కొండ మండలం సూర్యలత స్పిన్నింగ్ మిల్ సమీపంలో పొదల్లో ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా మంగళవారం సాయంత్రం 4గంటల సమయంలో -మిగతా4లో..

---



రైతాంగానికి విత్తన సంచులను అందజేస్తున్న దృశ్యం

## పంట మార్పిడి పద్ధతులను పాటించాలి

**రైతులు ఆర్థికంగా ఎదగాలి**

**ఎమ్మెల్యే డా.కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి**

**బిజినేపల్లి, జనవరి 28 ప్రభాతవార్త:** ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకొని రైతులు ఆర్థికంగా ఎదగాలని నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డా. కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి అన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం, జాతీయ కోపరేటివ్ వినియోగదారుల సమైక్య సహకారంతో పాలెం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రంలో రైతులకు మినుము చిరు విత్తన సంచుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం రైతాంగానికి పెద్దపీట వేస్తుందని వ్యవసాయ యాంత్రీకరణ కింద రైతులకు వివిధ రకాల యంత్రాలు, స్ప్రింక్లర్లు సబ్సిడీ కింద అందజేస్తున్నామని అలాగే విత్తనాలు, ఎరువులు ఇస్తున్నామని వివరించారు. ప్రతి రైతు పంట సాగులో మార్పిడి పద్ధతులను అవలంభించాలని శాస్త్రవేత్తల సలహాలతో విత్తనోత్పత్తిపై దృష్టి పెట్టాలని సూచించారు. స్థానికంగా ఉన్న కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ పరిశోధన కేంద్రాల పరిజ్ఞానాన్ని ఈ ప్రాంతా రైతులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ డా.చిన్నారెడ్డి మాట్లాడుతూ 1960 నుండి ఇందిరాగాంధీ కాలం నుండి ఎంతో కృషి చేస్తున్న ఈనాటికి అపరాలలో స్వయం సమృద్ధి సాధించలేక పోయామని, స్వయం సమృద్ధి కోసం రైతులు -మిగతా4లో..

## డ్రంక్ అండ్ డ్రైవ్‌పై కఠిన చర్యలు

### నలుగురికి జరిమానా, ఒకరికి జైలు శిక్ష



డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్న దృశ్యం

**మహబూబ్‌నగర్ క్రైమ్, జనవరి28 ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో అధిక మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వాహనదారులపై కఠిన చర్యలు తీసుకున్నట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. జిల్లా ఎస్పీ డి.జానకి ఆదేశాల మేరకు మహబూబ్‌నగర్ పట్టణంలో ట్రాఫిక్ సిబ్బంది డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా, మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న పలువురు వాహనదారులు పట్టుబడ్డారు. ఈ కేసులకు సంబంధించి బుధవారం సెకండ్ క్లాస్ కోర్టు జడ్జి ఆర్.శశిధర్ ముందు ఐదుగురు వాహనదారులను హాజరుపరచగా, అందులో నలుగురికి రూ.1,000/ చొప్పున జరిమానా విధించగా, ఒక వాహనదారుడికి మూడు రోజుల జైలు శిక్ష విధించబడింది. డ్రంక్ అండ్ డ్రైవ్ వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణ నష్టం జరిగే అవకాశాలు అధికంగా ఉంటాయని, ప్రజలు బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలని ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు. భవిష్యత్తులో కూడా డ్రంక్ అండ్ డ్రైవ్‌పై కఠిన చర్యలు కొనసాగుతాయని తెలిపారు.

## ఆడబిడ్డల పెళ్లిళ్లకు అండ కళ్యాణ లక్ష్మి

### దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి

**చిన్న చింతకుంట, జనవరి 28 ప్రభాతవార్త :** పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు అండగా నిలుస్తాయని దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని దమగ్నాపూర్ లోని తన స్వగృహంలో 14 మంది కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఆ దిశగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వం ధ్యేయమన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని ఆర్థిక ఇబ్బందులు ఉన్న దశలవారీగా అమలు చేస్తూ ముందుకు సాగుతున్నామన్నారు. ప్రజా ప్రభుత్వం ద్వారానే గ్రామాల అభివృద్ధి సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు ఎల్లన్న, ఆయా గ్రామాల సర్పంచులు తెలుగు శివకుమార్, దామోదర్ యాదవ్, అక్కల ఆంజనేయులు గౌడ్, భీమన్న గౌడ్, నాయకులు వట్టెం శివకుమార్, మాజీ ఎంపిటిసి శ్రీనివాస్ రెడ్డి, జైపాల్ రెడ్డి, వెంకటేష్, తెలుగు వెంకటేష్, కొండారెడ్డి, ఆశీర్వాదం, బాలవర్ధన్, శ్రీనివాస్ గౌడ్, ప్రతాప్, ఆర్ఐ తిరుపతయ్య, ఆయా గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




కళ్యాణ లక్ష్మి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే జిఎంఆర్

## కేతిరెడ్డిపల్లి శివారులో రేగువాని కుంట ధ్వంసం

### రేగువాని కుంటను పునరుద్ధరించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

**బాలానగర్, జనవరి 28 ప్రభాతవార్త :** బాలానగర్ మండలంలోని కేతిరెడ్డిపల్లి గ్రామ శివారు 275 సర్వే నెంబర్‌లో గతంలో 11: 34 గుంటల పొలం రేగువాని కుంట( శిఖం పట్టా)గా రెవెన్యూ రికార్డులో నమోదయి ఉంది. పట్టాదారులు కుంటను ధ్వంసం చేసి, మామిడి తోట పెట్టి, కంచె వేసుకున్నారని సామాజిక కార్యకర్త కోస్గి వెంకటయ్య బుధవారం జిల్లా కలెక్టర్, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందరు ప్రజా ప్రతినిధులు సామాజిక వనరులను రక్షించాల్సింది పోయి, రేగువాని కుంటను ధ్వంసం చేశారన్నారు. ఇలాంటి చర్యల వల్ల భూగర్భ జలాలు అడుగంటి, మూగ జీవాలకు తాగునీరు, ఆ ప్రాంత రైతులకు సాగునీరు లేక ఇబ్బందికరంగా మారిందని అన్నారు. ప్రజలు నీటి వనరులను సంరక్షించుకోవాలని, పర్యావరణాన్ని కాపాడాలన్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకొని, ధ్వంసమైన రేగువాని కుంటను తిరిగి పునరుద్ధరించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.



ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేస్తున్న కోస్గి వెంకటయ్య

## అవార్డు పొందిన టీచర్‌కి సన్మానం

**నారాయణపేట, జనవరి 26 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లా లో గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ చేతుల మీదుగా కమాండేషన్ పురస్కారం అందుకున్న ఊట్కూర్ మండలం అమీన్‌పూర్ పాఠశాల ఉపాధ్యాయురాలు భార్గవిని పిఆర్‌టియు మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. విద్యారంగంలో విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తూ, ముఖ్యంగా విద్యార్థుల్లో మౌలిక విద్యా నైపుణ్యాలు కార్యక్రమంలో విశేష సేవలు అందించినందుకు భార్గవి టీచర్‌కు ఈ పురస్కారం లభించింది. ఈ సందర్భంగా పిఆర్‌టియు మండల అధ్యక్షులు కోరం గోవర్ధన్ మాట్లాడుతూ మండలానికి గ్రామానికి మంచి పేరు తీసుకువచ్చిన భార్గవిని అభినందించారు. ఇదే స్ఫూర్తితో రాష్ట్ర,జాతీయ స్థాయిల్లో కూడా మరిన్ని పురస్కారాలు అందుకోవాలని, విద్యార్థుల విద్యాభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి నరసింహ రెడ్డి, అమీన్‌పూర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు విక్టర్ పాల్, మండల మహిళా అధ్యక్షురాలు శ్రీవిద్య, మండల గౌరవ అధ్యక్షులు ఫజల్ అహ్మద్, జిల్లా సభ్యులు శశిధర్ రెడ్డి, మండల అసోసియేట్ పిఆర్‌టియు అధ్యక్షులు భాస్కర్, కుటుంబ సభ్యులు జ్ఞానేశ్వరి, అబ్దుల్ సలాం, సత్యపాల్, లియాకత్, సంతోష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



టీచర్ భార్గవిని సన్మానిస్తున్న పిఆర్‌టియు మండల శాఖ

## తల్లి తండ్రులకు ఆడపిల్ల బాధ్యత కాదు, బలము : జడ్జి కె.అవినాష్

**నారాయణ పేట, జనవరి 28 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నారాయణపేట సఖి సెంటర్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె. అవినాష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జనవరి 24న జాతీయ బాలికా దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. బేటీ బచావో బేటీ పడావో" వంటి పథకాలు బాలికల రక్షణ విద్యకు దోహదపడుతున్నాయని చెప్పారు. సమాజంలో ఇంకా లింగ వివక్ష కొనసాగుతుండటం ఆందోళనకరమని పేర్కొన్నారు.బాలికలకు విద్య,ఆరోగ్యం,పోషకాహారం అందించడం చాలా అవసరమన్నారు.బాల్య వివాహాలను అరికట్టాలని,బాలికల హక్కులను కాపాడాలని సూచించారు.ఆడపిల్లలను చదివిస్తే కుటుంబానికి సమాజానికి బలంగా నిలుస్తారని తెలిపారు. సదస్సులో బాలికల రక్షణకు సంబంధించిన చట్టాలు,పోక్సో చట్టం,బాలకార్మిక నిషేధ చట్టంపై అవగాహన కల్పించారు. చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 సేవలను వినియోగించుకోవాలని సూచించారు. 15100 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పలు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




మాట్లాడుతున్న జడ్జి కె.అవినాష్

## ఉత్తమ ఉద్యోగిగా ప్రశంస పత్రం అందజేత

**నవాబుపేట, జనవరి 28 ప్రభాతవార్త :** నవాబుపేట మండల బెస్ట్ ఎంప్లాయ్‌గా నవాబుపేట ఎంపీడీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్న వనజకు సోమవారం గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి చేతుల మీదుగా ఉత్తమ ఉద్యోగిగా ప్రశంస పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా సీనియర్ అసిస్టెంట్ వనజ మాట్లాడుతూ కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ ఉద్యోగిగా ప్రశంసా పత్రాన్ని అందుకోవడం గర్వంగా ఉందని ప్రశంసా పత్రం రావడానికి దోహద పడిన మండల ఎంపీడీవో కార్యాలయ సిబ్బందికి తోటి ఉద్యోగులకు ధన్యవాదాలు తెలిపారు.



కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకుంటున్న వనజ

# ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి : డిటిఓ రఘుకుమార్

### ఉత్సాహంగా 2కె వాకథాన్ , పాలమూరు యూనివర్సిటీ నుంచి వన్ టౌన్ వరకు ర్యాలీ

**మహబూబ్‌నగర్ బ్యూరో,జనవరి 28 ప్రభాతవార్త:** జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా బుధవారం పాలమూర్ యూనివర్సిటీ నుంచి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ వరకు మహబూబ్‌నగర్ రవాణా శాఖ ఆధ్వర్యంలో 2కే వాకథాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాలమూర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొ॥ వి.శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ మాట్లాడుతూ రోడ్డు భద్రత అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాకుండా ప్రతి పౌరుని సామాజిక బాధ్యత. యువత రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కలిగి ఉండి, వాటిని ఆచరణలో పెట్టినప్పుడే ప్రమాదాలను నివారించగలుగుతాం" అని పేర్కొన్నారు. ఇటువంటి అవగాహన కార్యక్రమాలు విద్యార్థులలో బాధ్యతాభావాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. అనంతరం పోలీస్ శాఖ తరపున అదనపు ఎస్పీ ఎన్.బి రత్నం మాట్లాడుతూ రోడ్డు భద్రత అందరి బాధ్యత అని, ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నియమాలను తూచా తప్పకుండా పాటించాలని సూచించారు. హెల్మెట్ ధరించడం, సీట్‌బెల్ట్ వాడకం వల్ల ప్రాణ రక్షణ సాధ్యమవుతుందని వివరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్, ట్రిబుల్ రైడింగ్, ర్యాష్ డ్రైవింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్, మొబైల్ మాట్లాడుతూ వాహనం నడపడం వంటి చర్యలు ప్రాణాంతక ప్రమాదాలకు దారితీస్తాయని హెచ్చరించారు.ఈ 2కె వాకథాన్ కార్యక్రమాన్ని మహబూబ్‌నగర్ జిల్లా రవాణా అధికారి రఘుకుమార్ సమర్థవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన పలువురు ప్రముఖులు, అధికారులు, ప్రజలు మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని రోడ్డు భద్రతపై అవగాహనను వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న డిటిఓ రఘుకుమార్



2కె వాకథాన్ నిర్వహిస్తున్న దృశ్యం

## సిడిపిఓకు సమ్మె నోటీస్ అందజేత

**ఉప్పునుంతల, జనవరి 28 ప్రభాతవార్త :** ఫిబ్రవరి 12 న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఐసిడిఎస్ అచ్చంపేట ప్రాజెక్టు సిడిపిఓ లక్ష్మికి సమ్మె నోటీసు బుధవారం అందజేశారు. తెలంగాణ అంగన్‌వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ( సిఐటియు) అనుబంధం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 12 న జరుగు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ ఐసిడిఎస్ అచ్చంపేట ప్రాజెక్టు సిడిపిఓ లక్ష్మికి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా కార్యదర్శి పార్వతమ్మ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన వెంటనే కార్మికులకు వ్యతిరేకంగా నాలుగు లేబర్ కోడులను తీసుకురావడం జరిగిందని, దీంతో కార్మికుల పైన పనిభారం మోపడం జరుగుతుందన్నారు. సత్వరమే లేబర్ కోడులను రద్దు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలో క్రమ బద్ధీకరణ జరిగే వరకు కనీస వేతనం నెలకు 26 వేలు రూపాయలు ఇవ్వాలని, పెన్షన్ 10 వేలు అందజేయాలని ఆమె డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా అంగన్‌వాడి టీచర్లు, హెల్పర్లకు గ్రాట్యుటీ కోసం సుప్రీంకోర్టు ఉత్తర్వులను సత్వరమే అమలు చేయాలని, అంగన్‌వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్‌కు ఐసిడిఎస్‌కు సంబంధం లేకుండా అదనా పనులు అప్పగించకూడదని ఆమె డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రీ ప్రైమరీ, పీఎం శ్రీవిద్యను రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడి కేంద్రాలలనే నిర్వహించాలని ఆమె అన్నారు. పై డిమాండ్లను అమలు చేయాలంటూ ఫిబ్రవరి 12న జరుగు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని అంగన్‌వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ కు పిలుపునిచ్చారు. అచ్చంపేట ఐసిడిఎస్, సిడిపిఓ కు వినతిపత్రం అందజేసిన వారిలో అంగన్‌వాడి యూనియన్ ఉపాధ్యక్షురాలు అలివేల, అచ్చంపేట ప్రాజెక్ట్ కార్యదర్శి భారతి, చంద్రకళ, విజయలక్ష్మి, అలివేల, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లేష్ తదితరులు ఉన్నారు.



ఐసిడిఎస్ అచ్చంపేట ప్రాజెక్టు సిడిపిఓ లక్ష్మికి సమ్మె నోటీసు అందజేస్తున్న అంగన్‌వాడి యూనియన్ సభ్యులు

## ఎత్తిపోతల పథకం పనులతో ఊట్కూరు ముంపు ప్రమాదం

**నారాయణపేట, జనవరి 28 ప్రభాతవార్త :** మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం కింద చేపడుతున్న పనుల కారణంగా ఊట్కూర్ గ్రామం ముంపు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని సర్పంచ్ రేణుక భరత్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం చెరువులో నీటి నిల్వ పెరగడం వల్ల గ్రామంలోని పలు వీధుల్లో ఊట నీరు పైకి రావడంతో ఇళ్లపై ప్రభావం చూపుతోందన్నారు. ముఖ్యంగా 1వ వార్డు నుంచి 7వ వార్డుల వరకు ఇళ్ల పునాదుల కోసం తవ్విన గుంతల్లో కూడా నీరు ఉబికి వస్తోందని తెలిపారు. ఇదే పరిస్థితి గ్రామంలోని స్మశాన వాటికల్లో కూడా నెలకొన్నట్లు వివరించారు ప్రాజెక్ట్ పరిధిలో చెరువు నిల్వ సామర్థ్యం పెంపు, కొత్త కట్ట నిర్మాణం వంటి పనులు జరుగుతున్న నేపథ్యంలో భవిష్యత్తులో ముంపు ప్రమాదం మరింత పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ఊట్కూర్ గ్రామాన్ని అధికారికంగా ముంపు గ్రామంగా గుర్తించాలని కోరుతూ సంబంధిత అధికారులకు వినతి పత్రం సమర్పించినట్లు తెలిపారు. ఈ విషయంపై ఇరిగేషన్ ఎస్ఈ శ్రీధర్ స్పందిస్తూ, గ్రామ పరిస్థితిని పరిశీలించి గుర్తింపునకు అవసరమైన భూ పరీక్షలు నిర్వహిస్తామని హామీ ఇచ్చినట్లు సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ హనుమంతు, ఉప సర్పంచ్ రమేష్, టీఆర్ఎస్ నాయకులు కోరం శివారెడ్డి, వార్డ్ మెంబర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.



వినతి పత్రం సమర్పిస్తున్న దృశ్యం

## భారతీయ కిసాన్ సంఘం ఆధ్వర్యంలో భారత్ మాత పూజ

**నారాయణపేట, జనవరి 26 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా భారతీయ కిసాన్ సంఘం కార్యాలయంలో భారత్ మాత పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోమాత పూజ, శ్రీ భగవాన్ బలరాముని పూజలను కూడా నిర్వహించారు. రైతులు, కిసాన్ సంఘం కార్యవర్గ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.భారతీయ కిసాన్ సంఘం పిలుపు మేరకు జనవరి 26 నుండి ఫిబ్రవరి 2 వరకు ప్రతి గ్రామంలో భారత్ మాత పూజలు నిర్వహించి ప్రతి రైతు పాల్గొనాలని నిర్ణయించిన నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. సంఘం ప్రధానంగా జరుపుకునే నాలుగు ముఖ్య దినోత్సవాలలో భాగంగా జనవరి 26 భారత్ మాత పూజ గోపాష్టమి, శ్రీ భగవాన్ బలరామ జయంతి భారతీయ కిసాన్ సంఘ్ ఆవిర్భావ దినోత్సవం గ్రామ స్థాయిలో రైతు సోదర సోదరీమణులు అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భారత్ మాత ప్రతిమను పూలదండలతో అలంకరించి భూమిపై గోమయం అలికి రంగురంగుల ముగ్గులతో అలంకరించి, దీప,ధూపాలతో నైవేద్యం సమర్పించి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జోనల్ కార్యదర్శి వెంకోబా, జిల్లా సహకారదర్శి ఓబులాపురం మైపాల్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు శాశమోల బాలప్ప, గొడుగు లక్ష్మీనారాయణ, బాపనపల్లి రాము, నగర అధ్యక్షుడు ఆకుల వెంకటప్ప, నగర ఉపాధ్యక్షుడు తంగు విశ్వనాథ్ రెడ్డి, జాజాపురం లక్ష్మీకాంత్, మన్ని కాత్రే రాము, షేర్నపల్లి కూర రాములు, మండల అధ్యక్షుడు గడప శ్రీనివాస్, ఊట్కూర్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, అరుంధతిపల్లి నరసింహులు, దేవేందర్, నరసింహారెడ్డి, నాగరాజు,మాగనూరు తాళంగేరి శ్యామ్, ఉప సర్పంచ్ ఆనందు, ముస్కంపల్లి మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.



భారత్‌మాతకు పూజలు చేస్తున్న దృశ్యం

## ఆత్మకూర్ మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండా ఎగరేస్తాం

**ఆత్మకూర్ జనవరి 28, ప్రభాతవార్త:** త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా ఆత్మకూరు మున్సిపాలిటీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయడం ఖాయమని ఆత్మకూరు మార్కెట్ కమిటీ చైర్మన్ రహమతుల్లా అన్నారు. బుధవారం రోజు మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని రెండవ వార్డు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఆత్మకూరు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నల్లగొండ శ్రీనివాసులు నామినేషన్ పత్రాలను మున్సిపల్ కమిషనర్ శశిధర్ కు అందజేశారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ రహమతుల్లా మాట్లాడుతూ రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి శాఖ మంత్రివర్యులు వాకిటి శ్రీహరి అండదండలతో ఆత్మకూరు పట్టణ రూపురేఖలు మార్చేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందని అందుకుగాను త్వరలో జరగనున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో పట్టణ ప్రజలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించేందుకు సహకార అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే పట్టణంలో దాదాపు 150 కోట్లు నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్న విషయాన్ని ప్రజలు దృష్టిలో ఉంచుకొని అభివృద్ధికి పట్టం కట్టేందుకు ప్రజలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. గత పాలకులు ఇంద్ర లక్ష్మి మూలంగా ఆత్మకూరు పట్టణం అభివృద్ధి చెందకుండా 15లు వెనకబడిపోయిందని ప్రస్తుత రాష్ట్ర మంత్రిగా ఉన్నటువంటి మక్తల్ నియోజకవర్గం సభ్యులు వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు ఆత్మకూరులోని ప్రతి వార్డుకు కోట్లాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నట్లుగా ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



రెండవ వార్డు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శ్రీనివాసులు

## ఆయుష్ ప్రకృతి వైద్య శిబిరాన్ని సందర్శించిన రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు

**గద్వాల జనవరి 28, ప్రభాత వార్త:** న్యాచురోపతి, యోగ ఆయుష్ ప్రకృతి వైద్య శిభిరం మెడికల్ క్యాంప్ ను జోగులాంబ గద్వాల జిల్లా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మెన్ సంగాల అయ్యపు రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జి.రమేష్ లతో కార్యవర్గ సభ్యులు సందర్శించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని గవర్నమెంట్ హాస్పిటల్ లో తెలంగాణ ప్రభుత్వం యోగ అధ్యయన పరిషత్, ఆయుష్ శాఖ డైరెక్టర్ అండ్ సెక్రటరీడాక్టర్ పెరుగు శ్రీకాంత్ బాబు, కొనిజెటి రోషయ్య నేచర్ క్యూర్ హాస్పిటల్ డా. ఏ. మాలతీ శ్యామల సూపరింటెడెంట్ లు ఆయుష్ మెడికల్ క్యాంపు న్యాచురోపతి ప్రకృతి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బృందం హాజరయ్యారు. గద్వాల ప్రజలు పాత్రులై, వైద్యపరీక్షలు చేయించుకున్నారు. క్యాంపు కోర్డినేటర్ ఏ. నవీన్ జ్యోతి, డా. లక్ష్మీ సువర్ణ, సీనియర్ మెడికల్ ఆఫీసర్, డా. సులేఖ , యోగ ఇంస్ట్రక్టర్లు, జూనియర్ డాక్టర్లు పాల్గొని వైద్య సేవలు అందించారు.ఈ శిబిరం లో అక్యూపెంక్చర్, డైట్ కౌన్సిలింగ్, యోగ థెరపీ, ఫిజియో థెరపీ సేవలను అందించారు. దీర్ఘకాలిక వ్యాధులకు చికిత్స నేచర్ క్యూర్ హాస్పిటల్, హైద్రాబాద్ ఐ పీ, ఒ పీ సేవలను ఉపయోగించు కోవాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జోగులాంబ గద్వాల జిల్లా కార్యనిర్వాక సభ్యులు అప్సర్ పాషా, పాల్ సుధాకర్, మహేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్లు

## సమ్మక్కసారలమ్మ జాతరకు సెలవులు ప్రకటించాలి

### పీఆర్టీయూ టీఎస్ స్టేట్ సెక్రటరీ అమరేంద్ర సాగర్

**మహబూబ్‌నగర్ జనవరి 28 ప్రభాతవార్త:** సమ్మక్క, సారలమ్మ జాతరకు రాష్ట్ర ప్రభుత్వం సెలవులు ప్రకటించాలని పీఆర్టీయూ టీఎస్ స్టేట్ సెక్రటరీ అమరేంద్ర సాగర్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఆసియా ఖండంలోనే అతి పెద్ద ఆదివాసి సమ్మేళనంగా జరిగే సమ్మక్కసారలమ్మ జాతరకు దేశ నలుమూలల నుండి లక్షలాది మంది భక్తులు విచ్చేస్తున్నందున ప్రభుత్వ కార్యాలయాలకు, పాఠశాలలకు కనీసం రెండు రోజులు అయిన ప్రత్యేక సాధారణ సెలవులు ప్రకటించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

## ప్రమాదాల నివారణకు వేగ నియంత్రికల ఏర్పాటు




వేగ నియంత్రికలను ఏర్పాటు చేస్తున్న దృశ్యం

**బాలానగర్, జనవరి 28 ప్రభాతవార్త :** బాలానగర్ మండలం ఉడిత్యాల గ్రామంలో రహదారిపై బిఆర్ఎస్ నాయకులు శ్రీధర్ గౌడ్ కోరిక మేరకు విజయ కార్డియాక్ హాస్పిటల్ డా. చందు లాల్ రాథోడ్ ఆర్థిక సహకారంతో, డా. వెంకటేష్ సూచన మేరకు బుధవారం 2 వేగ నియంత్రికలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ గౌడ్ మాట్లాడుతూ వాహనదారులు గ్రామాలలో తమ వాహనాల వేగం నియంత్రణకు, ప్రమాదాల నివారణకు వేగ నియంత్రికలను ఏర్పాటు చేయడం శుభ పరిణామం అన్నారు. వేగ నియంత్రికలను దృష్టిలో ఉంచుకొని ప్రయాణాలు కొనసాగిస్తే, గ్రామాలలో రోడ్డు ప్రమాదాలు తగ్గే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఉడిత్యాల గ్రామ వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మున్సి'పోల్స్'కు నామినేషన్ల స్వీకరణ

### -తొలిరోజు ఒకే ఒక నామినేషన్ దాఖలు

**భూత్పూర్,జనవరి 28,ప్రభాతవార్త :** మున్సిపల్ పోరు ఆరంభమైంది.మున్సిపల్ ఎన్నికలకు బుధవారం నోటిఫికేషన్ వెలువడడంతో ఆయా పార్టీలు తమ అభ్యర్థుల్ని గెలిపించుకునేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నాయి.సర్పంచి ఎన్నికల్లా కాకుండా ఈ ఎన్నికలు పార్టీ గుర్తులపై జరుగుతున్న నేపథ్యంలో ఆయా పార్టీలు ఈ స్థానిక పోరులో తమ అభ్యర్థుల్ని నిలిపి బలాబలాల్ని తేల్చుకునేందుకు సన్నద్ధమయ్యాయి.భూత్పూర్ పట్టణ మున్సిపాలిటీలో మొత్తం 10వార్డులున్నాయి.చైర్మన్ పదవిని ఎస్టీ జనరల్‌కు కేటాయించడంతో పదవీనాశించిన ఇతర పార్టీల సామాజిక వర్గం నాయకులు వీలైనన్ని స్థానాల్ని గెలిచి వైఎస్ చైర్మన్ పదవిని చేజిక్కించుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. బుధవారం నామినేషన్ల స్వీకరణను మున్సిపల్ అధికారులు చేపట్టారు.తొలిరోజు ఒకే ఒక నామినేషన్ దాఖలైంది.మూడో వార్డు ఇండిపెండింగ్ అభ్యర్థిగా ముత్తయ్య నామినేషన్ దాఖలు చేసినట్లు మున్నిపల్ కమిషనర్ పి చంద్రశేఖర్‌రావు తెలిపారు.

## మున్సిపాలిటీలో నామినేషన్ కౌంటర్ల పరిశీలన

### మొదటి రోజు నామినేషన్లు నిల్

**మద్దూరు, జనవరి 28 ప్రభాతవార్త :** రెండవ సాధారణ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మద్దూరు మున్సిపాలిటీలో జనవరి 28 నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. ఈ సందర్భంగా మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన ఆరు నామినేషన్ కౌంటర్లను నారాయణపేట జిల్లా ఎస్పీ డా. వినీత్ సందర్శించారు. నామినేషన్ల స్వీకరణ మొదటి రోజున ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదని అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఎలక్షన్ అథారిటీ మున్సిపల్ కమిషనర్ సి.శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు.

## పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి



**గద్వాల జనవరి 28, ప్రభాతవార్త:** జిల్లాలో పనిచేస్తున్న మండల ఆపరేటర్ల పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ డీఎల్ పీవో ప్రవీణ్ కుమార్ కు తెలంగాణ ఈ పంచాయతీ ఆపరేటర్స్ అసోసియేషన్ సభ్యులు కలిసి వినతిపత్రం సమర్పించారు. జిల్లా పంచాయితీ మండల, అపరేటర్లుగా జిల్లాలో సుమారు 12 మంది విధులు నిర్వహిస్తుండగా, గత మూడు నెలలుగా వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణ భారమై తామంతా ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. జనవరి చివరి లోపు తమ సమస్యను పరిష్కరించని యెడల ఫిబ్రవరి 1 నుంచి విధులను బహిష్కరిస్తామని ఆపరేటర్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు భార్గవ్ రెడ్డి, ఉపాధ్యక్షులు రాకేష్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి జగదీష్, కోశాధికారి తన్వీర్, ముఖ్య సలహాదారులు నాగరాజు,సభ్యులు ఖయ్యూమ్, శివ కుమార్, పర్ణీత,శాలిభాష,మోహన్ గౌడ్,అశోక్ కుమార్, అమ్రేష్ తదితరులున్నారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిన బిఆర్ఎస్ కార్యకర్తలు



కాంగ్రెస్ పార్టీలో చేరిన బిఆర్ఎస్ కార్యకర్తలు

**శ్రీరంగాపూర్, జనవరి 28 ప్రభాతవార్త:** శ్రీరంగాపురం మండలంలోని తాటిపాముల గ్రామ బిఆర్ఎస్ పార్టీకి చెందిన ఉపసర్పంచ్ కురుమయ్య తోపాటు 60 మంది నాయకులు, కార్యకర్తలు మండల నాయకులు బీరం రాజశేఖర్ రెడ్డి, మాజీ ఎంపిటిసి వెంకటయ్య ఆధ్వర్యంలో బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి వనపర్తి శాసనసభ్యులు తుడి మెగారెడ్డి తన నివాస కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ కండువులను కప్పి సాధారంగా పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీలో ఎలాంటి ఇబ్బందులు ఉండవని ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా వారి రాజకీయ పనులు చేసుకోవచ్చని ఎవరికి భయపడవలసిన అవసరం లేదని ఏదైనా ఉన్న తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే తుడి మేగారెడ్డి వారికి సూచించారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు విష్ణువర్ధన్ గౌడ్, పరమేశ్వరమ్మ, బుచ్చన్న నాయుడు, అలివేలమ్మ, బజారయ్య చిన్న రాయుడు గ్రామ నాయకులు సూర్యబాబు, రాజు, బాలునాయక్, బోయ శ్రీను, రాజగౌడు, మురళి గౌడు, ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి రంజిత్, బాలరాజు, శేఖర్, వెంకటయ్య, ధర్మరాజు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీడీవో సేవలు అభినందనీయం



ఎంపిడిఓ శ్రీనివాసులును అభినందిస్తున్న దృశ్యం

**మాగనూర్, జనవరి 28 ప్రభాతవార్త:** మాగనూర్ మండల ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసులు సేవలు అభినందనీయమని కాంగ్రెస్ పార్టీ మాగనూర్ మండల అధ్యక్షుడు ఆనంద్ గౌడ్ అన్నారు. 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ చేతుల మీదుగా బెస్ట్ ఎంపీడీవోగా అవార్డు అందుకున్న సందర్భంగా బుధవారం ఆయన చాంబర్‌లో శాలువాతో సన్మానించారు. మండలాన్ని ఇంకా అభివృద్ధి పథంలో నడిపించాలని ఆకాంక్షించారు. ఈయనతో పాటు వడ్వాట్ సర్పంచ్ రవీందర్, ఉజ్జల్లి సర్పంచ్ రంగారెడ్డి, బైరంపల్లి సర్పంచ్ పంపన్న, కాంగ్రెస్ మండల నాయకుడు శివరాం రెడ్డి ఉన్నారు.

## విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

**వెల్దండ, జనవరి 28 ప్రభాతవార్త:** వెల్దండ మండల కేంద్రంలోని మోడల్ పాఠశాలలో శ్రీరాం లైఫ్ ఇన్సూరెన్స్ ప్రవేశపెట్టిన ప్రతిభా పురస్కారం స్కీం బ్రోచర్‌ను పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీధర్‌తో కలిసి గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్యగౌడ్ విడుదల చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్యగౌడ్ మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థిని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. పేద విద్యార్థిని విద్యార్థులకు ప్రతిభ పురస్కారం లాంటి ఒక వినూత్న కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిన శ్రీరామ లైఫ్ ఇన్సూరెన్స్ యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. ఉపసర్పంచ్ శ్రీను ముదిరాజ్, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ మేనేజర్ శేఖర్, వార్డు సభ్యులు కిష్టాల్, వెంకటేష్, రమేష్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొయ్యల పుల్లయ్య, తిరుపతిరెడ్డి, రాహుల్, ప్రిన్సిపల్, పాఠశాల ఉపాధ్యాయులు ,విద్యార్థులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయునికి సన్మానం



ఉపాధ్యాయుడు మన్సూర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 28 ప్రభాతవార్త:** అత్యుత్తమ సేవలు అందించి, పదో తరగతి పరీక్ష ఫలితాలలో ఉత్తమ ఫలితాలు సాధించడంలో గత ఐదు సంవత్సరాలుగా ఎనలేని కృషి చేస్తున్న హిందీ ఉపాధ్యాయులు స్కూల్ అసిస్టెంట్ ఎండి మన్సూర్ నాగర్ కర్నూల్ కలెక్టర్ బాదావత్ సంతోష్ చేతుల మీదుగా ఉత్తమ సేవా అవార్డు అందుకోవడం పై తోటి ఉపాధ్యాయులు అధికారులు అభినందించారు. తన పాఠశాలలో జడ్పీహెచ్ఎస్ మార్చాల ప్రత్యేక తరగతులు నిర్వహించడం పాఠశాలలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం హర్షించదగ్గ విషయం అన్నారు. సాయంకాలపు తరగతులలో విద్యార్థులకు తన సొంత ఖర్చులతో అల్పాహారం ఏర్పాటు చేసారని, ప్రతి విద్యా సంవత్సరం సెలవులు వాడుకోకుండా ప్రతిరోజు పాఠశాలకు హాజరు కావడం ప్రశంసనీయం అన్నారు. అందుకుగాను జిల్లా విద్యాశాఖ విద్యాధికారి ఏ. రమేష్ కుమార్ ఘనంగా సన్మానించారు.

## ఎంఈఓ పని విధానం బాగుంది : డీఈఓ



పాఠశాలను తనిఖీ చేసిన డీఈఓ గోవిందరాజులు

**మాగనూర్, జనవరి28 ప్రభాతవార్త:** మాగనూర్ ఎంఈఓ మురళీధర్ రెడ్డి పని విధానం బాగుందని డిఇఓ గోవిందరాజులు అన్నారు. ఆయన బుధవారం ఆకస్మికంగా జడ్పీ హైస్కూల్ మాగనూర్‌ను సందర్శించారు. స్కూల్లో అమలవుతున్న విద్య ప్రణాళికలు, కార్యకలాపాలను, విద్యార్థుల ప్రగతి గురించి జిహెచ్ఎంను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల అభివృద్ధికి పాటుపడుతున్న ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. ముఖ్యంగా పదవ తరగతి విద్యార్థులు ఇచ్చిన ప్రతిస్పందన ఎంతో ఉత్తమంగా ఉందనిహర్షం వ్యక్తం చేశారు. పాఠశాల అడ్మినిస్ట్రేషన్ బాగుందని సంతోషించారు. పాఠశాల రూపొందించినఎస్ఎస్‌సి యాక్షన్ ప్లాన్‌ను పరిశీలించి, అది చాలా సమర్థవంతంగా, లక్ష్యసాధనకు అనుకూలంగా ఉందని అన్నారు. ఎస్ఎస్‌సి ఫలితాలలో మండల్ టాపర్‌గా తన పాఠశాల ఉండటంలో మురళీధర్ రెడ్డి కృషి ఎంతో ఉందని ప్రత్యేకంగా అభినందించారు. పదవ తరగతి విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.

## విద్యార్థులు శ్రద్ధతో చదివి మంచి ఫలితాలను సాధించాలి



విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ అధ్యాపకులు

**శ్రీరంగాపూర్, జనవరి28 ప్రభాత వార్త:** శ్రీరంగాపూర్ మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మోజెస్ , అధ్యాపకులు వెంకట కృష్ణ కృష్ణమూర్తి బుధవారం ఉదయం సాయంత్రం కంబాలపురం బుసిరెడ్డిపల్లి గ్రామాలలో కళాశాలలో చదువుతున్న విద్యార్థిని, విద్యార్థుల ఇండ్ల దగ్గరికి వెళ్లి విద్యార్థుల చదువుకు సంబంధించిన అంశాలను తల్లిదండ్రులతో అడిగి తెలుసుకున్నారు. 20 రోజులలో పరీక్షలు ప్రారంభమవుతాయని ఈ సమయం చాలా కీలకమని విద్యార్థులు శ్రద్ధతో చదువుకుని మంచి ఫలితాలను సాధించే విధంగా తల్లిదండ్రులు ఇంటి దగ్గర పిల్లలు చదివే విధంగా చూడాలని సాయంత్రం పూట 5 గంటల వరకు కళాశాల వద్ద స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నామని అందుకు తల్లిదండ్రులు సహకరించాలని ప్రిన్సిపల్ అధ్యాపకులు కోరడం జరిగింది. విద్యార్థినీ, విద్యార్థుల పైన ప్రత్యేకమైన శ్రద్ధ చూయించి ఇంటి దగ్గరికి వచ్చి తల్లిదండ్రులను కలిసి మాట్లాడటం వల్ల తల్లిదండ్రులు గ్రామ ప్రజలు ఆనందాన్ని వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది.

# నామినేషన్లు షురూ..

- మొదటి రోజు 34 నామినేషన్లు దాఖలు



నామినేషన్ దాఖలు చేస్తున్న అభ్యర్థులు

**వనపర్తి ప్రతినిధి, జనవరి28 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా మున్సిపల్ ఎన్నికలు ప్రారంభమైన మొదటి రోజు వనపర్తి జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలకు సంబంధించి 80 వార్డులు ఉండగా వాటిలో బుధవారం మొదటి రోజు 34 నామినేషన్లు దాఖలు అయినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. 5 మున్సిపాలిటీలలో అమరచింత 10 వార్డులకు గాను 0 ,ఆత్మకూర్ 10 వార్డులకు గాను 4, కొత్తకోట 15 వార్డులకు గాను 4, పెబ్బేరు 12 వార్డులకు గాను1, అత్యధికంగా వనపర్తి 33 వార్డులకు గాను 25 నామినేషన్లు దాఖలైనట్లు వారు తెలిపారు. ఈ మేరకు మున్సిపాలిటీ ఎన్నికల్లో ప్రచార పోస్టర్లు, కరపత్రాల ముద్రణలో ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటించాలని ఆర్డీవో సుబ్రహ్మణ్యం ప్రింటింగ్ ప్రెస్‌యజమానులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాలోని ప్రింటింగ్ ప్రెస్ యజమానులతో ఎన్నికల ప్రవర్తన నియమావళిపై సమావేశం నిర్వహించి ఎన్నికల ప్రవర్తన నియమావళిపై అవగాహన కల్పించారు. ఎన్నికల ప్రచారం సందర్భంగా కరపత్రాలు, పోస్టర్ల ముద్రణలో ప్రింటింగ్ ప్రెస్ యజమానులు పాటించాల్సిన నియమ నిబంధనలపై అవగాహన కల్పించారు. ప్రచార సామాగ్రి అయిన పోస్టర్లు, కరపత్రాల్లో కులం, మతపరమైన అంశాలను ప్రస్తావించరాదని, అదేవిధంగా వ్యక్తిగత విమర్శలు లేకుండా చూసుకోవాలని సూచించారు. పబ్లిషర్ నుండి ఫారం ఎలో డిక్లరేషన్ తీసుకోవాలని, ఫారం ఎ, బి తో పాటు ముద్రించిన 2 కర పత్రాలను జతపరచి కలెక్టరేట్‌కు పంపించాలని సూచించారు. ముద్రించిన కరపత్రం లేదా గోడ పత్రికపై ప్రింటింగ్ ప్రెస్ పేరు, చిరునామా ఖచ్చితంగా పేర్కొనాలని, అంతేకాకుండా పబ్లిషర్ పేరు ఫోన్ నెంబర్ ముద్రించాలన్నారు. ఎన్ని పేజీలు ముద్రించారు, అందుకు తీసుకున్న పైకం ఎంత అనే వివరాలు ఫారం బిలో చూపెట్టాలని సూచించారు. ప్రింటింగ్ ప్రెస్‌యజమానులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. డి ఎక్షన్ సూపరింటెండెంట్ మదన్ మోహన్, ప్రింటింగ్ ప్రెస్ యజమానులు పాల్గొన్నారు.

## దేవరకద్ర మున్సిపాలిటీలో నాలుగు నామినేషన్లు దాఖలు



నామినేషన్ కేంద్రం వద్ద పోలీసులు పటిష్ట బందోబస్తు

**దేవరకద్ర, జనవరి28 ప్రభాతవార్త:** దేవరకద్ర మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ బుధవారం ప్రారంభమైంది. నూతనంగా ఏర్పడిన దేవరకద్ర మున్సిపాలిటీలో మూడు వార్డులలో నాలుగు నామినేషన్లు దాఖలు అయ్యాయని మున్సిపల్ కమిషనర్ నరేష్ బాబు తెలిపారు. ఈ ప్రక్రియలో భాగంగా మూడో వార్డు నుండి బిజెపి అభ్యర్థిగా పృథ్వి యామనూర్, బిఆర్ఎస్ అభ్యర్థిగా కాటం అనిత, నాలుగో వార్డ్ నుండి బిజెపి అభ్యర్థిగా ఉమా పిట్టల, 07 వ వార్డ్ నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా జట్రం బీరప్ప దాఖలు చేశారు. అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసేందుకు మున్సిపాలిటీ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశామని మున్సిపల్ కమిషనర్ నరేష్‌బాబు తెలిపారు. అదే విధంగా దేవరకద్ర మున్సిపాలిటీ నామినేషన్ కేంద్రం వద్ద పోలీసులు పట్టిన బందోబస్తు చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరంతరం నిఘా ఉంచినట్లు దేవరకద్ర ఎస్ఐ నాగన్న తెలిపారు.

## మున్సిపల్ ఎన్నికల నామినేషన్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్ల పరిశీలన



నామినేషన్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు పరిశీలిస్తున్న దృశ్యం

**మ్యద్దూరు, జనవరి 28 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లాలో మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో బుధవారం డీఎస్పీ నల్లపు లింగయ్య మద్దూరులో 16 వార్డులకు, కోస్గిలో 16 వార్డులకు సంబంధించిన మున్సిపల్ నామినేషన్ కేంద్రాలను సందర్శించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా నామినేషన్ కేంద్రాలవద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఎన్నికల నియమావళిని ఖచ్చితంగా అమలు చేయాలని సూచించారు. నామినేషన్ కేంద్రాల ప్రజలెవరూ గుంపులు గుంపులుగా ఉండకుండా చూడాలని, పరిసరాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన బందోబస్తు నిర్వహించాలని ఆదేశించారు. శాంతియుతంగా, స్వేచ్ఛాయుతంగా ఎన్నికలు నిర్వహించేందుకు పోలీస్‌శాఖ పూర్తిగా కట్టుబడి ఉందని డీఎస్పీ తెలిపారు. డీఎస్పీతో పాటు స్థానిక పోలీసులు కోస్గి సీఐ సైదులు, ఎస్సైలుబాలరాజు, విజయ్ కుమార్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పేదల సొంతింటి కలను నెరవేర్చడమే ప్రభుత్వం లక్ష్యం

- గ్రామానికి 30 ఇండ్లు మంజూరు
- సర్పంచ్ శైలజ శ్రీనివాసరెడ్డి



ఇందిరమ్మ ఇల్లు నిర్మాణానికి ముగ్గు పోస్తున్న కూలీలు

**మల్దకల్ జనవరి 28, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని పేదల సొంతింటి కలను నెరవేర్చడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకానికి శ్రీకారం చుట్టిందని సర్పంచ్ శైలజ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మల్దకల్ మండలం పరిధిలోని బిజ్వారం గ్రామంలో సర్పంచ్ శైలజశ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం పద్మ, వెంకటేష్ రెండవవార్డ్‌లో లబ్ధిదారులు నిర్మించుకుంటున్న ఇందిరమ్మ ఇండ్లను స్థానిక నాయకులు, పంచాయతి కార్యదర్శి బసిరెడ్డి కలిసి ముగ్గు పోసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శైలజ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ... సకాలంలో ఇల్లు పూర్తి చేసుకొని ప్రభుత్వం అందిస్తున్న ఐదు లక్షల ఆర్థిక సాయం పొందాలని కోరారు. గ్రామానికి మొత్తం 30 ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయని తెలిపారు. ఇప్పటికే 30 ఇళ్ల నిర్మాణ పనులు వివిధ దశలో కొనసాగుతున్నాయని, మిగతా వాళ్ళు పనులు కూడా శరవేగంగా ప్రారంభమయ్యాయని తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తూ మాట నిలబెట్టుకుంటోందని వారు పేర్కొన్నారు. పేదలకు గౌరవ ప్రధానమైన జీవితం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈపథకాన్ని అమలు చేస్తోందని, లబ్ధిదారులు నాణ్యమైన నిర్మాణం చేపట్టేలా అధికారులు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం గ్రామీణ ప్రజలకు వరంగా మారిందని వారు తెలిపారు.

## ఫార్మసీ అధ్యాపకురాలికి పీహెచ్‌డి అవార్డు

### అభినందించిన పియూ విసి, అధ్యాపక బృందం



పీహెచ్‌డి అవార్డు అందుకుంటున్న సుష్మిత



పీహెచ్‌డి అవార్డు పొందిన సుష్మిత (ఫైల్)

**మహబూబ్‌నగర్, జనవరి 28 ప్రభాతవార్త:** పాలమూరు యూనివర్సిటీలో దశాబ్ద కాలానికి పైగా ఫార్మసీ విభాగంలో అధ్యాపకురాలిగా సేవలందిస్తున్న సుస్మిత పీహెచ్డీ అవార్డును పొందారు. ఆమె డాక్టర్ మేనక పర్యవేక్షణలో " బయో ఎనలిటికల్ మెథడ్ డెవలప్మెంట్ అండ్ వాలిడేషన్ ఆఫ్ సమ్ ఆంటీ వైరల్ డ్రగ్స్ ఇన్ హ్యూమన్ ప్లాస్మా బై ఎల్ సిఎం ఎస్ /ఎంఎస్" అనే అంశంపై పరిశోధన చేసి, తమిళనాడులోని అన్నామలై యూనివర్సిటీలో పీహెచ్‌డి వైవా-వోస్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. సుస్మిత స్వస్థలం మహబూబ్‌నగర్‌జిల్లా గొల్లపల్లి గ్రామం. ఆమె తల్లిదండ్రులు మాధవి - మనోహర్ గౌడ్. కాగా, భర్త కే. చక్రవర్తి చైతన్య గౌడ్. విద్యాభ్యాస పరంగా ఆమె1వ తరగతి నుండి 10వ తరగతి వరకు దీపిక మెమోరియల్ హై స్కూల్, షాద్‌నగర్, ఇంటర్మీడియట్ శ్రీ చైతన్య జూనియర్ కాలేజ్, హైదరాబాద్, బి.ఫార్మసీ - సరోజినీ రాములమ్మఫార్మసీ కళాశాల, మహబూబ్‌నగర్, ఎం.ఫార్మసీ - బీజూ పట్నాయక్ యూనివర్సిటీ, ఒడిశాలో పూర్తి చేశారు. సుస్మిత చేసిన పరిశోధన ఫలితాలు పలు అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురితమవడం విశేషం. ఆమె పరిశోధన బయో అనలిటికల్ మెథడ్స్, డ్రగ్ అనాలిసిస్ రంగాల్లో కీలకంగా ఉపయోగపడతాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో పాలమూరు యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్య జి.ఎన్. శ్రీనివాస్ మాట్లాడుతూ పీహెచ్డీ సాధించిన తర్వాత కూడా పరిశోధనలు నిరంతరం కొనసాగించాలని సూచించారు. ఆధునిక పద్ధతుల ద్వారా ఫార్మకోడైనమిక్స్, ఫార్మకోకైనెటిక్స్ లక్షణాలను అధ్యయనం చేయడం వల్ల ఔషధం శరీరంలో ఎంత మోతాదులో, ఎంత సమయంలో వ్యాధి నివారణకు ఉపయోగపడుతుందో తెలుసుకోవచ్చని తెలిపారు. ఈ విధానం ద్వారా వ్యాధి తీవ్రతకు అనుగుణంగా సరైన డోసేజ్‌ను నిర్ణయించడం సాధ్యమవుతుందని, తద్వారా మానవ ఆరోగ్య పరిరక్షణలో కీలక పాత్ర పోషించగలుగుతాయని పేర్కొన్నారు. ఔషధాల వినియోగం తగ్గడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదం కలుగుతుందని తెలిపారు. బోధన తో పాటు మహిళా వసతి గృహం కు వార్డెన్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలోప్రిన్సిపాల్ డా. రవికాంత్, హెచ్‌ఓడీ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి, అధ్యాపకులు డా. స్వాతి, శారద, డాఈశ్వర్ కుమార్ డా. సుజాత, డా. సురేష్, డా. భూమయ్య, డా. రవికుమార్, డా. జ్ఞానేశ్వర్, డా. సోమేశ్వర్, డా. కోమటిసోమేశ్, డా. శ్రీనివాస్ పాల్గొని సుస్మితను అభినందించారు. పీహెచ్డీ సాధించడంద్వారా సుస్మిత విద్యా- పరిశోధనా రంగంలో మరో మైలురాయిని అధిగమించారని, ఇది యువ పరిశోధకులకు ఆదర్శంగా నిలుస్తుందని వక్తలు కొనియాడారు.

## ఉపాధి అవకాశాల్లో రాణించాలి



దుకాణాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే మర్రి

**బిజినేపల్లి, జనవరి 28 ప్రభాతవార్త:** ఉపాధి, వ్యాపార రంగాల్లో రాణించడానికి నేటి యువత, మహిళలు నైపుణ్యాభివృద్ధి, సాంకేతిక పరిజ్ఞానం సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో బోయాపూర్ గ్రామ సర్పంచ్ ప్రణీత శ్రీకాంత్ నూతన చైత్ర ఆప్టికల్స్ దుకాణాన్ని బుధవారం ప్రారంభించారు. స్వయం ఉపాధి అవకాశాలతో ఆర్థిక పరిపుష్టి సాధించవచ్చు అన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పులేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ అంజి, తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్లో హెల్ప్ డెస్క్

### ఎన్నికల సమాచారం, ఫిర్యాదుల పరిష్కారానికి కంట్రోల్ రూం ఏర్పాటు

**మహబూబ్‌నగర్, జనవరి28 ప్రభాతవార్త:** 2వ సాధారణ మున్సిపల్ ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం(కలెక్టర్ కార్యాలయం) నందుహెల్ప్ లైన్ ఫిర్యాదుల పరిష్కారంకు కంట్రోల్ రూం నెంబర్- 08542 241165 ఏర్పాటు చేయడం జరిగిందని, ఎన్నికల సంబంధించిన సమాచారం, ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన పై ఫిర్యాదుల కొరకు సంప్రదించవచ్చని, ఈ కంట్రోల్ రూమ్ లో (24) గంటలు సిబ్బంది అందుబాటులో ఉంటారని, రిజిష్టర్ ఏర్పాటు చేసి వచ్చిన ఫిర్యాదులనురికార్డ్ చేస్తూ నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లా ప్రజలు మున్సిపల్ ఎన్నికలు 2026కు సంబంధించి ఫిర్యాదులకై పై ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని, జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయేందిర బోయి కోరారు.

## కారు-డీసీఎం ఢీకొని వ్యక్తి మృతి



మృతి చెందిన వల్లపుదాస్ వెంకటేష్

**వెల్దండ, జనవరి 28 ప్రభాతవార్త:** కారు-డీసీఎం ఢీకొని కారు నడుపుతున్న వ్యక మృతి చెందిన ఘటన వెల్దండ మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై కురుమూర్తి తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై గల నారాయణపూర్ స్టేజి దగ్గర రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం చరికొండ గ్రామానికి చెందిన వల్లపుదాస్ వెంకటేష్ (30) ప్రైవేటు ఉద్యోగం చేస్తూ హైదరాబాదులోనివాసం ఉంటున్నాడు. కల్వకుర్తిలో తన స్నేహితుల వివాహ కార్యక్రమానికి వస్తుండగా కల్వకుర్తి నుండి వస్తున్న డీసీఎం ఢీకొని కారు నుండి జాతీయ రహ దారిపై వెంకటేష్ ఎగిరిపడి తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు. కేశంపేట మండలానికి చెందిన డీసీఎం డ్రైవర్ కే. వెంకటయ్యపై చర్యలు తీసుకోవాలని మృతుడి తల్లి అలివేల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

## ఎన్నికల పరిశీలకులుగా లక్ష్మీబాయి బాధ్యతలు



లక్ష్మీబాయికి పూల మొక్కతో ఆహ్వానం పలుకుతున్న జిల్లా కలెక్టర్

**వనపర్తి, జనవరి 28 ప్రభాతవార్త :** వనపర్తి జిల్లాలో మున్సిపాలిటీ ఎన్నికలు నియమ నిబంధనల ప్రకారం పకడ్బంగా నిర్వహించేందుకు సాధారణ ఎన్నికల పరిశీలకులుగా మార్కెటింగ్ డైరెక్టర్ జి. లక్ష్మీబాయి, వ్యయ పరిశీలకులుగా యం. శ్రీనివాసులు, జిల్లా ఆడిట్ అధికారి నాగర్‌కర్నూల్‌లను ఎంపిక చేస్తూ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఉత్తర్వులు జారీచేశారు. బుధవారం మున్సిపల్ ఎన్నికల సాధారణ పరిశీలకులు జి. లక్ష్మీబాయి బాధ్యతలు స్వీకరించగా జిల్లా ఎన్నికల అథారిటీ ఆదర్శ్‌సురభి, అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ యాదయ్య మొక్కను ఇచ్చి సాదరంగా ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఎన్నికల సాధారణ పరిశీలకులు మాట్లాడుతూ జిల్లాలోఎన్నికలు పారదర్శకంగా ప్రశాంత వాతావరణంలో నిర్వ హించేందుకు ఎన్నికల ప్రవర్తన నియమావళి పకడ్బందీగా అమలు చేసేందుకు చర్యలు తీసుకోవడంజరుగుతుందన్నారు. అంతకు ముందు ఎన్నికల వ్యయ పరిశీలకులు యం. శ్రీనివాసులు సైతం ఉదయాన్నే బాధ్యతలు స్వీకరించారు.

## గెలుపే లక్ష్యంగా పని చేయాలి


### మున్సిపాలిటీల ముఖ్యనాయకులతో మాజీ ఎమ్మెల్యే ఆల

**భూత్పూర్, జనవరి 28, ప్రభాతవార్త:** వచ్చే నెల11న జరిగే మున్సిపాలిటీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేసి బీఆర్ఎస్ విజయానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని మూడు(భూత్పూర్, కొత్తకోట, దేవరకద్ర) మున్సిపలిటీల బీఆర్ఎస్ ముఖ్యనాయకులతో బుధవారం భూత్పూర్ మండలం అన్నాసాగర్‌లో మున్సిపల్ ఎన్నికలను పురస్కరించుకుని ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఆల మాట్లాడుతూ దేవరకద్ర నియోజకవర్గంలోని మూడు మున్సిపాలిటీలలో బీఆర్ఎస్ గెలుపునకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని పిలుపునిచ్చారు.

## బీఆర్ఎస్‌లో చేరికలు

**భూత్పూర్, జనవరి 28, ప్రభాతవార్త:** భూత్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఒకటో వార్డులోని పలు తండాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు బుధవారం మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వసురాంతండాకు చెందిన శంకర్ నాయక్, రాందాస్‌తండాకు చెందిన రాందాస్‌నాయక్, శ్రీను నాయక్‌లు బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి మాజీ ఎమ్మెల్యే ఆల గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మనెమోని సత్యనారాయణ, సత్తూర్ నారాయణగౌడ్, తూము శ్రీనివాస్‌రెడ్డి, మూష సాయిలు, మూష బాలస్వామి, అజ్జు, జాకీర్, ఆగిరి సత్యం ఇతర నాయకులు పాల్గొన్నారు.

## దిగుడుమెట్ల పనులు ప్రారంభం



**చిన్న చింతకుంట, జనవరి 28 ప్రభాతవార్త:** పేదల తిరుపతిగా పేరుగాంచిన శ్రీ కురుమూర్తి స్వామి దర్శించుకున్న అనంతరం దిగుడుమెట్ల ద్వారా కొండ దిగువకు రావడానికి భక్తులు ఎన్నో అవస్థలు పడుతూ రావాల్సిందే. దిగుడుమెట్లను పొడిగింపు చేయాలన్న భక్తుల కోరిక మేరకు దాతల సహకారంతో బుధవారం దిగుడుమెట్ల పొడిగింపు పనులకు ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ప్రారంభమయ్యాయి. కొండ దిగువన దేవస్థాన కార్య నిర్వహణ అధికారి కార్యాలయ పక్క నుంచి దిగుడుమెట్ల పొడిగింపు పనులు చేపడుతున్నట్లు మాజీ చైర్మన్ గౌని గోవర్ధన్ రెడ్డి తెలిపారు. ముడా నుంచి రాజగోపురం ముందు రౌండ్‌షెడ్ నిర్మాణానికిగాను రూ. 25 లక్షలు, కోనేరు సమీపంలోని ధర్మశాల వద్ద భక్తులు దాసంగాలు కోసం రూ .25 లక్షలతో రేకుల షెడ్డు నిర్మాణ పనులను ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. దాతల సహకారంతోనే ఆలయం అభివృద్ధి జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ పాలక మండల్ సభ్యులు భాస్కరాచారి, ఆలయ అర్చకులు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

# ఎన్నికల సంఘం నిబంధనలు పాటించాలి

◆ బ్యాంకు ఖాతాలు ఓపెన్ చేయాలి
◆ జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలన అధికారి బి. శ్రీనివాస్ బాబు

**మహబూబ్‌నగర్, జనవరి28 ప్రభాతవార్త:** మున్సిపాలిటీలు, మునిసిపల్ కార్పొరేషన్ లకు రెండవ సాధారణ ఎన్నికలు 2026 ఎన్నికల్లో వార్డ్ మెంబెర్స్‌గా పోటీ చేయు అభ్యర్థులు ఎన్నికల వ్యయ పరిమితిపై రాష్ట్ర ఎన్నికల సంఘం సూచనలు పాటించాలని జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలన అధికారి బి.శ్రీనివాస్‌బాబు తెలిపారు.ఎన్నికలలో పోటీ చేస్తున్న అభ్యర్థులకు ఎన్నికల ఖర్చు నిర్వహణకు సంబంధించిన రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఇచ్చిన సూచనలు జారీ చేశారు.

**ఇవి సూచనలు :** నామినేషన్ వేయడానికి ముందు ఎన్నికల ప్రచార ఖర్చు నిర్వహించుటకు ప్రత్యేక బ్యాంకు ఖాతాను ఏదైనా బ్యాంకులో తెరవవలెను పోటీ చేయు అభ్యర్థి ప్రచారం కొరకు చేయు ప్రతి ఖర్చు కూడా బ్యాంకు అకౌంట్ నుండి విత్ డ్రా చేసినిర్వ హించాలని ఆయన పేర్కొన్నారు ( లేక అతని/ఆమె ఎన్నికల ఏజెంట్ జాయింట్ అకౌంట్ ఓపెన్ చేసినట్లయితే దాని నుండి విత్ డ్రా చేసి ఖర్చు చేయవలెను. ఎన్నికలలో పోటీ చేస్తున్న అభ్యర్థులు వారికి ఇచ్చిన రోజువారీ ఖర్చుల ఖాతాల నిర్వహణ రిజిస్టర్ లో రోజు వారీ ప్రచార వ్యయ ఖర్చులు నమోదు చేయాలి మునిసిపల్ కార్పొరేషన్ లో వార్డు మెంబర్ గా పోటీ చేయు అభ్యర్థి వారి ప్రచార నిమిత్తం గరిష్ఠంగా రూ.1,50,000/ వరకు మరియు మునిపలిటీ లో వార్డు మెంబర్ గా పోటీ చేయు అభ్యర్థి గరిష్ఠంగా రూ.1,00,000/ వరకు ఖర్చు చేయవచ్చును. రోజు వారీ ఖర్చు నమోదు పుస్తకాలను సమగ్రంగా నిర్వహించడం. ఎన్నికల వ్యయ లెక్కల కోసం జిల్లా ఎన్నికల అధికారి ఇచ్చిన నోటిఫైడ్ రేటు పట్టికను ఉపయోగించడం. సభలు, వాహనాలు మరియు ఇతర ప్రచార కార్యక్రమాల కోసం సంబంధిత అధికారుల (మున్సిపల్ కమిషనర్) నుండి అనుమతులు పొందడం. వ్యయ చేయు సమయంలో వ్యయాలకు సంబంధించిన వౌచర్లు, బిల్లులు తీసుకొనవలెను మరియు వాటిని రిజిస్టర్ల తనిఖీ సమయంలో చూయించవలెను. ఎన్నికల ప్రచార ఖర్చుల కోసం ప్రత్యేకంగా తెరిచిన బ్యాంకు ఖాతా ద్వారా మాత్రమే అన్ని లావాదేవీలు నిర్వహించడం. ఎన్నికల ఖర్చులన్నింటినీ అభ్యర్థి ఎన్నికల ప్రయోజనం కోసం తెరిచిన బ్యాంకు ఖాతా నుండి క్రాస్డ్ అకౌంట్ పేయీ చెక్కు ద్వారా చెల్లించాలి. అయితే, అభ్యర్థి(లు) ఏదైనా వ్యక్తి/సంస్థకు, ఏదైనా ఖర్చు వస్తువుకు చెల్లించాల్సిన మొత్తం ఎన్నికల మొత్తం ప్రక్రియలో రూ. 20,000/ మించకపోతే, అటువంటి ఖర్చును ఎన్నికల ప్రయోజనం కోసం తెరిచిన బ్యాంకు ఖాతా నుండి ఉపసంహరించుకోవడం ద్వారా నగదు రూపంలో చేయవచ్చు. మిగతా అన్ని చెల్లింపులు ఆ బ్యాంకు ఖాతా నుండి అకౌంట్ పేయీ చెక్కు లేదా డ్రాఫ్ట్ లేదా ఖాతా బదిలీ ద్వారా చేయాలి. పారదర్శకత మరియు జవాబుదారీతనం దృష్ట్యా, అభ్యర్థి(లు) ఎన్నికల ప్రక్రియలో ఒకే వ్యక్తి లేదా సంస్థ నుండి రూ. 20,000/ కంటే ఎక్కువ విరాళం లేదా రుణాన్ని నగదు రూపంలో స్వీకరించరాదని మరియు రూ. 20,000/ కంటే ఎక్కువ ఉన్న అన్ని విరాళాలు/రుణాలను అభ్యర్థిఖాతా చెల్లింపుదారు చెక్కు లేదా డ్రాఫ్ట్ లేదా ఖాతా బదిలీ ద్వారా స్వీకరించాలని మరియు అభ్యర్థి(లు) అటువంటి వ్యక్తులు/సంస్థల పూర్తి పేరు మరియు చిరునామాను నిర్వహించాలని, వీటిని సంబంధిత నిర్దేశిత ప్రోఫార్మాలోనిరోజువారీ ఎన్నికల ఖర్చు ఖాతాల నిలువు వరుసలలో పేర్కొనాలని కూడా కమిషన్ ఆదేశించింది. తనిఖీ సమయంలో, అభ్యర్థి, అతని ఏజెంట్ లేదా పార్టీ కార్యకర్త లేదా పోస్టర్లు లేదా ఎన్నికల సామాగ్రిని తీసుకువెళుతున్న ఏదైనా వాహనంలో రూ.50,000/ కంటే ఎక్కువనగదు లేదా రూ.10,000/ కంటే ఎక్కువ విలువైన ఏదైనా మద్యం, ఆయుధాలు లేదాబహుమతి వస్తువులు లేదా ఎన్నికల ప్రేరణగా ఉపయోగించబడేఏదైనాఇతర అక్రమవస్తువులు దొరికితేవాటిని స్వాధీనం చేసుకుంటారు. ఎన్నికల కాలంలో నిర్ణీత మూడు దఫాల ఖర్చుల రిజిస్టర్ల తో పరిశీలనలకు హాజరు కావడం...ఎన్నికల ఫలితాలు ప్రకటించిన 45రోజుల లోపు ఎన్నికలలో పోటీచేసిన ప్రతి అభ్యర్థి విధిగా తాము నిర్వహించిన ఎన్నికల ఖర్చుల వివరాలను సంభందించిన మునిసిపల్ కమిషనర్‌లకు సమర్పించాలి లేనిచో మున్సిపల్ చట్ట ప్రకారం మరియు ఎన్నికల నిబంధనల మేరకు తగు చర్య తీసుకొనబడునని తెలిపారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సమక్షంలో ఎఫ్ఎస్‌టీలు/ఎస్ఎస్‌టీలు/అసిస్టెంట్‌వ్యయ పరిశీలనా అధికారులు/ అకౌంటింగ్ బృందానికి నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో జిల్లా నోడల్ అధికారి, వ్యయ మానిటరింగ్ ఆధ్వర్యంలోపై అన్ని సూచనలు జారీ చేశారు.



సూచనలు చేస్తున్న జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలన అధికారి బి. శ్రీనివాస్ బాబు

## పురపాలికల్లో నామినేషన్లు సజావుగా ప్రారంభం


నామినేషన్ల ప్రక్రియను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

**మొదటి పేజీ తరువాయి భాగం**
ఓటరు జాబితా అందుబాటులో ఉంచడం వంటి అన్ని మౌలిక వసతులు కల్పించడం పై కలెక్టర్ సంతృప్తిని వ్యక్తం చేశారు. తొలిరోజు మంచి రోజు కావడంతో చాలా మంది నామినేషన్లు వేసే అవకాశం ఉన్నందున ఎలాంటి పొరపాట్లకు తావు ఇవ్వకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎఈఆర్‌గావ్యవహరిస్తున్నమున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లును ఆదేశించారు. వచ్చిన నామినేషన్లు ఎప్పటికప్పుడు స్కాన్ చేసి టిపోల్‌లో అప్లోడ్ చేసే విధంగా కంప్యూటర్ ఆపరేటర్‌లను పెట్టుకొని నామినేషన్ల ప్రక్రియ సజావుగా కొనసాగే విధంగా చూడాలన్నారు. స్పెషల్ ఆఫీసర్ ఉమాదేవి,అదనపు కలెక్టర్‌లోకల్ బాడీస్‌యాదయ్య నామినేష్ల ప్రక్రియను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు.స్పెషల్ ఆఫీసర్, అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ యాదయ్య, సిబ్బంది తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల స్వీకరణకు పూర్తి ఏర్పాట్లు

**మొదటి పేజీ తరువాయి భాగం**
సదుపాయాలపై అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని నారాయణపేట, మక్తల్, మద్దూర్, కోస్గి మున్సిపాలిటీలకు సంబంధించిన నామినేషన్ల స్వీకరణ కోసం అన్ని రకాల సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ నేటి నుంచి ఈ నెల 30వ తేదీ వరకు కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఎన్నికల కమిషన్ జారీ చేసిన నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ నామినేషన్లు స్వీకరించాలని అధికారులకు సూచించారు అభ్యర్థులు నామినేషన్ పత్రాలతో పాటు అఫిడవిట్, ఆస్తులు–బాధ్యతల వివరాలు, క్రిమినల్ కేసుల సమాచారం, అవసరమైన ఫీజు రశీదు తప్పనిసరిగా సమర్పించాలని తెలిపారు. అన్ని పత్రాలు సమగ్రంగా ఉన్నప్పుడే నామినేషన్‌ను స్వీకరించాలని స్పష్టం చేశారు. నామినేషన్ దాఖలులో అభ్యర్థులకు ఏవైనా సందేహాలు ఉంటే హెల్ప్‌డెస్క్‌ను సంప్రదించేలా అవగాహన కల్పించాలని,అవసరమైన సూచనలు ముందుగానే అందించాలని అధికారులను ఆదేశించారు.నామినేషన్ కేంద్రపరిసరాల్లో గుంపులు ఏర్పడకుండా చూడాలని,ఎన్నికల ప్రవర్తనానియమావళి ఉల్లంఘనకు తావివ్వకుండా శాంతియుత వాతావరణంలో నామినేషన్ ప్రక్రియ పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా, నామినేషన్ల పరిశీలన స్క్రూటినీ, ఉపసంహరణ తేదీలను కూడా అభ్యర్థులకు స్పష్టంగా తెలియజేయాలని అధికారులకు కలెక్టర్ ఆదేశించారు.

## వైభవంగా లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు

పట్టు వస్త్రాలు సమర్పించిన మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కరి అనిత మధుసూదన్ రెడ్డి దంపతులు


స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించిన మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కరి అనిత మధుసూదన్ రెడ్డి దంపతులు

**మహబూబ్‌నగర్, జనవరి 28 ప్రభాతవార్త:** సింహగిరిలో అంగరంగ వైభవంగా శ్రీలక్ష్మి నరసింహస్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం అయ్యాయి. ఈ కార్యక్రమంలో స్వామివారికి అమ్మవారికి మహబూబ్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కరి అనిత మధుసూదన్ రెడ్డి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. దంపతులు బెక్కరి అనిత రెడ్డి చైర్పర్సన్ వ్యవసాయ మార్కెట్ కమిటీ, మహబూబ్‌నగర్ అసెంబ్లీ కోఆర్డినేటర్ బెక్కరి మధుసూదన్ రెడ్డి, పోల శ్రీనివాసులు, సిహెచ్ కృష్ణయ్య, భాస్కర్, సంజీవగౌడ్, రామకృష్ణ,తిరుపతయ్య, భక్తులు, పుణ్య దంపతులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ ఓట్ల కోసం వస్తే తరిమి కొట్టండి

**మొదటి పేజీ తరువాయి భాగం..**
గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు డి.నారాయణ, మున్సిపల్ ఎన్నికల కన్వీనర్ ఆర్. లోకనాథ్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయ్యగారి ప్రభాకర్ రెడ్డి, సబిరెడ్డి వెంకటరెడ్డి, సీనియర్ నాయకులు అశ్విని నందకుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్ గౌడ్, పెద్దిరాజు, మున్సిపల్ ఎన్నికల కోకన్వీనర్ కేతూరి బుడ్డన్న, జిల్లా కార్యవర్గ సభ్యులు బత్తిని మధుసూదన్ రెడ్డి, మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు ఎండి. ఖలీల్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు గంధం ప్రవీణ్, పెద్దమందడి మండల అధ్యక్షులు ముప్పూరు చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రసాద్ శెట్టికి ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం

**నారాయణపేట, జనవరి28 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా కేంద్రంలోని పీఎస్ సునంద మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డా. ప్రసాద్ శెట్టి అరుదైన గౌరవాన్ని అందుకున్నారు. సామాజిక సేవా రంగంలో ఆయన చేసిన విశిష్ట కృషికి గుర్తింపుగా ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కింది. రికార్డుకు ప్రధాన కారణాలు అత్యధిక హెల్త్ క్యాంపులు 2025 సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా అత్యధిక సంఖ్యలో ఉచిత ఎముకల సాంద్రత పరీక్షా శిబిరాలు నిర్వహించడం ఉచిత వైద్య సేవలు శిబిరాలకు హాజరైన రోగులకు ఎముకల దృఢత్వ పరీక్షలు నిర్వహించడమే కాకుండా, అవసరమైన వారికిఉచితంగా మందులు పంపిణీ చేయడం మేయర్ ఆర్గానిక్స్ భాగస్వామ్యం ఈసేవాకార్యక్రమాలను గుర్తించి, మేయర్ ఆర్గానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు డా. ప్రసాద్ శెట్టికి ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్ సర్టిఫికేట్‌ను అందజేశారు. కార్యక్రమాల ముఖ్య ఉద్దేశ్యం గ్రామీణ ప్రాంత ప్రజల్లో ఎముకల ఆరోగ్యంపై అవగాహన కల్పించడం, అలాగే ఖరీదైన వైద్య పరీక్షలను నిరుపేదలకు ఉచితంగా అందించడం ఈ కార్యక్రమాల ప్రధాన లక్ష్యమని తెలిపారు. డా.ప్రసాద్ శెట్టి సాధించిన ఈ గౌరవం జిల్లా వైద్య రంగానికి గర్వకారణమని పలువురు అభినందించారు.

## ధన్వాడ మండల కేంద్రంలో రేషన్ బియ్యం అక్రమ దందా?

**ధన్వాడ, జనవరి28 ప్రభాతవార్త :** ధన్వాడ మండల కేంద్రంలో ప్రభుత్వం పేదల సంక్షేమానికి అందిస్తున్న రేషన్ బియ్యాన్ని కొంతమంది అక్రమార్కులు ఇల్లిల్లు తిరిగి వాహనాల్లో లోడ్ చేసుకుంటూ బహిరంగంగా అక్రమ దందా కొనసాగిస్తున్నారని గ్రామస్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు సేకరించి, గుట్టుచప్పుడు కాకుండా నిల్వ చేసుకుని తరువాత అధికధరలకు అమ్ముకుంటున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ అక్రమ వ్యవహారం వల్ల నిజమైన లబ్ధిదారులు తమకు రావాల్సిన బియ్యం కోల్పోతూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గ్రామస్తులు వాపోతున్నారు.అధికారుల నిర్లక్ష్యం,పర్యవేక్షణ లోపమే ఇలాంటి అక్రమాలకు బలం చేకూరుస్తోందని విమర్శలు వినిపిస్తున్నాయి. తక్షణమే పౌర సరఫరాల శాఖ అధికారులు రంగంలోకి దిగి, అక్రమ నిల్వలపై దాడులు చేసి,బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. పేదల బియ్యం పేదలకే చేరేలా కఠిన నియంత్రణ చర్యలు అమలు చేయాలని వారు కోరుతున్నారు.

## క్రీడాకారుల ఔధార్యం.. ప్రైజ్ మనీ విరాళం

**రాజాపూర్, జనవరి 28 ప్రభాతవార్త :** రాజాపూర్ మండలం ముదిరెడ్డిపల్లి గ్రామంలో దేవొళ్ళ ఆంజనేయులు లక్ష్మీదేవి జ్ఞాపకార్థంగా గ్రామ సర్పంచ్ దేవొళ్ళ మీనా శేఖర్‌గౌడ్ నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ లో వచ్చిన ప్రైజ్ మనీ రూ. 15వేలను క్రీడాకారులు గ్రామపాఠశాలకు మినీ తాగునీటి ట్యాంకు ఏర్పాటు కోసమై విరాళం అందజేశారు. దీంతో విద్యార్థులు, క్రీడాకారులు తీసుకున్న నిర్ణయం పట్ల పలువురుహర్షం వ్యక్తం చేస్తూ వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దేవొళ్ళ మీనా శేఖర్ గౌడ్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు క్రీడాకారులు పాల్గొన్నారు.


ప్రైజ్ మనీని విరాళంగా అందజేస్తున్న దృశ్యం

# ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించాలి

నియమావళి ఉల్లంఘనలకు తావు లేదు
ఎన్నికలకు పటిష్ట బందోబస్తు,144 సెక్షన్ అమలు
మహబూబ్‌నగర్ ఎస్పీ డి.జానకి
నామినేషన్ కేంద్రాల పరిశీలన


మహబూబ్‌నగర్‌లో నామినేషన్ కేంద్రాల వద్ద ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎస్పీ జానకి

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 28 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ పట్టణ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాలను జిల్లా ఎస్పీ డి.జానకి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నామినేషన్ ప్రక్రియను పర్యవేక్షిస్తూ, కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన బందోబస్తు చర్యలను పరిశీలించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికలు పూర్తిగా శాంతియుతంగా,స్వేచ్ఛాయుతంగా న్యాయసమ్మతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని తెలిపారు. నామినేషన్ కేంద్రాలన్నీ పూర్తి స్థాయిలో సీసీ కెమెరాల నిఘాలో ఉన్నాయని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు అవకాశం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఎన్నికల సందర్భంగా 144 సెక్షన్ అమలులో ఉందని, నామినేషన్ కేంద్రాలు మరియు పోలింగ్ కేంద్రాల పరిధిలో గుంపులుగా చేరవద్దని ప్రజలను కోరారు. పోలింగ్ కేంద్రాల చుట్టూ 100 మీటర్ల పరిధిలో బారికేడింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి మున్సిపాలిటీ పరిధిలో రెండు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి నిరంతర తనిఖీలు నిర్వహిస్తున్నామని చెప్పారు.రూ.50 వేల కంటే ఎక్కువ నగదు తీసుకువెళ్లకూడదని, ఎన్నికల సమయంలో ప్రలోభాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమస్యలు సృష్టించే అవకాశం ఉన్న వ్యక్తులపై ముందస్తుగా రూ.5 లక్షల వరకు బైండోవర్ చర్యలు చేపడుతున్నామని, బైండోవర్ నిబంధనలు ఉల్లంఘిస్తే పూచీకత్తు మొత్తాన్నిజరిమానాగా వసూలుచేస్తామని జిల్లా ఎస్పీ స్పష్టం చేశారు.ప్రతి ఒక్కరూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పనిసరిగా పాటించి, ఓటర్లుస్వేచ్ఛగా తమఓటు హక్కును వినియోగించుకునేలా సహకరించాలని ఆమె కోరారు.ఈ పరిశీలనలో వన్ టౌన్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ అప్పయ్యతో పాటు ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అట్టహాసంగా నామినేషన్ దాఖలు



49వ డివిజన్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న ప్రసన్న ఆనంద్ కుమార్ గౌడ్

◆ సర్వేశ్వరుని ఆశీస్సులు ◆ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి సహకారం
◆ డివిజన్ అభివృద్ధి లక్ష్యం ◆ 49వ డివిజన్ అభ్యర్థి ప్రసన్న ఆనంద్ కుమార్ గౌడ్

**మహబూబ్‌నగర్, జనవరి28 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో డివిజన్ అభివృద్ధి లక్ష్యంగా అందరినీ కలుపుకొని ముందుకు సాగుతామని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ప్రసన్న ఆనంద్ కుమార్ గౌడ్ తెలిపారు. ఆ సర్వేశ్వరుడి ఆశీస్సులతో, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి సహకారంతో డిసిసి అధ్యక్షుడు సంచిముదిరాజ్ ఆదరణతోనే మరింత ముందుకు సాగి సమిష్టిగా పోరాడుతామని స్పష్టం చేశారు.బుధవారం పార్టీ నాయకులు శ్రేణులతో కలిసి అట్టహాసంగా49వ డివిజన్ కాంగ్రెస్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కరి అనిత మధుసూదన్ రెడ్డి, టీజేసీ మాజీ చైర్మన్ రాజేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో 60 మంది చేరికలు


కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మెగారెడ్డి, శివసేనారెడ్డి

**వనపర్తి, జనవరి 28 ప్రభాతవార్త:** మున్సిపాలిటీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీలోకి భారీగా చేరికల పర్వం మొదలైంది. జిల్లా కేంద్రంలోని 30 వ వార్డు పరిధిలో ఉన్న సాయి నగర్ కాలనీ, ఐజనగర్ కాలనీ, జంగిడిపురం, నంది హిల్స్ నుంచి క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో 60 మంది మహిళలు ,పురుషులు, యువకులు బుధవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే మేఘా రెడ్డి, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు శివసేన రెడ్డి సమక్షంలో పార్టీ చేరారు. పార్టీలో చేరిన వారందరినీ ఎమ్మెల్యే మేఘా రెడ్డి, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేఘారెడ్డి,కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు శివసేన రెడ్డి మాట్లాడుతూ ప్రజలు వాస్తవాలు గ్రహించి, ప్రజా ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరడం జరిగిందని స్పష్టం చేశారు. రేవంత్ సర్కార్ చేస్తున్న సంక్షేమం సబండ వర్గాలకు మేలు జరిగేలా కృషి చేస్తున్నారని గుర్తు చేశారు. రానున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సుధాకర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, ప్రతాపరెడ్డి, గోపిగౌడ్, స్వప్న, సంధ్య,రోజా, అవినాష్, రఘు, వెంకటేశ్వర రెడ్డి, భాషా, కృష్ణారెడ్డి, పలువురు పాల్గొన్నారు.

## ఆరోపణలు అవాస్తవం


◆ మిడ్జిల్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు అల్వాల్ రెడ్డి

**మిడ్జిల్, జనవరి 28 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో భూమి వివాదానికి సంబంధించి తనపై వస్తున్న ఆరోపణలను మిడ్జిల్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు తంగేళ్ల అల్వాల్ రెడ్డి ఖండించారు.ఈ మేరకు బుధవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. రెండు రోజులుగా వాస్తవ ప్రకటనలను తీవ్రంగా ఖండించారు. దీనిపై న్యాయస్థానాన్ని ఆశ్రయించి సంబంధికులపై స్పష్టం చేశారు.తనపై ఆరోపణలు చేసిన తనపై చేస్తున్న ఆరోపణలకు సంబంధించి రుజువులు చూయించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అదే పత్రికలో అదే స్థానంలో ఖండన ప్రచురించాలని డిమాండ్ చేశారు. రాయని పక్షంలో సంబంధితులపై చట్ట పరమైనచర్యలకు వెనుకాడేదిలేదని అన్నారు.ఇదే విషయంలో బుధవారం మిడ్జిల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు. తనపై ఆరోపణలు చేస్తూనే ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డిపై బురద జల్లే విధంగా సోషల్ మీడియాలో ప్రచారంవీడియోలు చేయడం పట్ల తీవ్రంగా వ్యతిరేకించారు. వివాదాస్పద భూమికి సంబంధించి నిబంధనల ప్రకారంచట్ట ప్రకారమే క్రయవిక్రయాలు జరిగాయని ఇందులో ఏమైనా తప్పిదాలు జరిగితే కోర్టు పరిధిలో పరిష్కరించవచ్చు గాని తనకు సంబంధం లేకుండా తనపై ఆరోపణలు చేయడం కబ్జా కోరుగా చిత్రీకరించడం ఏమిటని ప్రశ్నించారు. ఈ క్రమంలోనే చట్టపరమైన చర్యలకు సిద్ధపడి లీగల్ ప్రాసెస్ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల నామినేషన్లు ప్రారంభం

**నారాయణపేట, జనవరి 28 ప్రభాతవార్త:** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో నారాయణపేట జిల్లాలోనామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీల పరిధిలో మొత్తం 72 వార్డులు ఉండగా, తొలి రోజు మొత్తం 18 నామినేషన్లు దాఖలైనట్లు అధికారిక నివేదికలో వెల్లడైంది. మద్దూర్ మున్సిపాలిటీలో 16 వార్డులు ఉన్నప్పటికీ ఇప్పటివరకు ఒక్క నామినేషన్ కూడా దాఖలుకాలేదు. నారాయణపేట మున్సిపాలిటీలో 24 వార్డులకు గాను 2 నామినేషన్లు వచ్చాయి. మక్తల్ మున్సిపాలిటీలో 16 వార్డులకు 4 నామినేషన్లు, కోస్గి మున్సిపాలిటీలో 16 వార్డులకు గాను అత్యధికంగా 12 నామినేషన్లు దాఖలయ్యాయి. పార్టీ వారీగా చూస్తే కాంగ్రెస్ పార్టీ నుంచి 14, బీజేపీ నుంచి 1, బీఆర్ఎస్ నుంచి 2, స్వతంత్ర అభ్యర్థి 1 నామినేషన్ దాఖలు చేసినట్లు సమాచారం. మిగతా రాజకీయ పార్టీల నుంచి ఇంకా నామినేషన్లు రాలేదు.

## గుడేబల్లూరులో కల్తీ మద్యం?


దొరికిన మద్యం కల్తీ సీసా

**కృష్ణ, జనవరి 28 ప్రభాతవార్త:** మండలంలోని గుడే వల్లూరు గ్రామంలోని టై రోడ్డులో బెల్టు షాపుల్లో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.ఈ క్రమంలో బుధవారం కల్తీ మద్యం విక్రయించారంటూ కొందరు యువకులు ఎక్సైజ్ పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఓ ప్రముఖ మద్యం కంపెనీకి చెందిన లైట్ బీర్ కల్తీ చేసినట్లు కొంత మంది యువకులు గుర్తించి సదరు బాటిల్ తీసుకొని షాపువద్దకు చేరుకొని పరిస్థితిని వివరించే ప్రయత్నం చేశారు. గుడేబల్లూరు వార్డు మెంబర్ కె. రవీంద్ర కల్తీ మద్యాన్ని అరికట్టాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.మండలంలో కల్తీ మద్యం విక్రయిస్తున్న ఎక్సైజ్‌అధికారులు పట్టించుకోవడంలేదని పలువురు వాపోతున్నారు.అధికారుల అండతోనే బెల్టుషాపుల నిర్వాహకులు ఇలాంటి దారుణాలకు ఒడిగడుతున్నారని బాహాటంగానే చెబుతున్నారు. ఫిర్యాదులు అందిన ఎక్సైజ్ అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. కల్తీ మద్యాన్ని అరికట్టి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

## పేకాట స్థావరంపై పోలీసుల దాడులు

**అయిజ జనవరి28, ప్రభాతవార్త;** మండల పరిధిలోని గుడిదొడ్డి గ్రామ శివారులో గ్రామానికి చెందిన లోకేష్ రెడ్డి పోలం యందు పేకాట ఆడుతున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు బుధవారం పోలీసులు పేకాట స్థావరంపై దాడి నిర్వహించి ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్సై శ్రీనివాసరావు తెలిపారు.

## పంట మార్పిడి పద్ధతులను పాటించాలి


డ్రోన్ ఉపయోగం గురించి రైతాంగానికి వివరిస్తున్న దృశ్యం

**మొదటి పేజీ తరువాయి భాగం**
నాణ్యమైన రకాలను వాడాలని పిలుపునిచ్చారు. రైతులు శాస్త్రవేత్తల ముఖాముఖి కార్యక్రమంలో రైతాంగం తక్కువ కాలంలో చేతికొచ్చే మినుము రకాలను ఎంచుకోవాలని అపరాల విస్తీర్ణాన్ని ఘననీయంగా పెంచాలని మంచి దిగుబడులను సమృద్ధిని సాధించాలని,ఉత్పాదకతను పెంచుకోవాలని శాస్త్రవేత్తలు సూచించారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పుష్పావతి మాట్లాడుతూ రైతాంగం ఆహార భద్రత కాకుండా పోషకాహార భద్రతపై కూడా దృష్టి సారించాలన్నారు. కెవికె కోఆర్డినేటర్ డా. కె. శ్రీదేవి మాట్లాడుతూ ఇతర హబ్‌ను ఏర్పరిచిన తర్వాత అపరాల విస్తీర్ణం దిగుబడి విత్తన నాణ్యత జిల్లాలో ఎంతో పెరిగిందని చెప్పారు. ఎన్‌సి సిఎఫ్ సలహాదారు జగదీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ భారత్ బ్రాండ్‌కు చెందిన పప్పు దినుసులను 30 నుండి 40ధరలను తగ్గించి రైతాంగానికి అందిస్తున్నామని వివరించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జిల్లా అధికారులు యశ్వంత్‌రావ్,వెంకటేశం, రవిచంద్ర జగదీశ్వర్‌రెడ్డి శాస్త్రవేత్తలు రైతులు పాల్గొన్నారు.

## అందరి సహకారంతో గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతా..

ముదిరెడ్డిపల్లి సర్పంచ్ మీనా శేఖర్ గౌడ్

**రాజాపూర్, జనవరి 28 ప్రభాతవార్త:** ముదిరెడ్డిపల్లి గ్రామ పాలకవర్గం గ్రామ ప్రజల సహకారంతో గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు తన శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని ముదిరెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ దేవొల్ల మీనా శేఖర్‌గౌడ్ పేర్కొన్నారు.బుధవారం గ్రామ సచివాలయంలో నిర్వహించిన గ్రామసభలో గ్రామానికి సంబంధించిన పలు సమస్యలు తమదృష్టికి వచ్చాయని, సమస్యలను ఒక్కొక్కటి పరిష్కరిస్తూ గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని అన్నారు. గ్రామ ఉపసర్పంచ్, పాలకవర్గ సభ్యుల సమన్వయంతో గ్రామపంచాయతీని ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దేందుకు ముందంజలో ఉంటానని అన్నారు.

## ఎండాకాలంలో నీటి సమస్య రాకుండా చర్యలు

**మద్దూరు, జనవరి 28 ప్రభాతవార్త:** మద్దూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో రామన్న అధ్యక్షతన రాబోయే ఎండాకాలం నేపథ్యంలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామాలకు సరిపడా నీటి సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని, బోర్ల మరమ్మత్తులు, లీకేజీల సరిచేత, ఆన్–ఆఫ్ ట్యాప్‌లు బిగించాలన్నారు. ప్రతి నెల 1,11,21 తేదీలలో వాటర్ ట్యాంకులను తప్పనిసరిగా శుభ్రం చేయాలని సూచించారు.ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చెన్నయ్య, గ్రిడ్ ఇన్‌చార్జి సూపర్‌వైజర్ వెంకటేశ్‌తో పాటు వివిధ గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## గంజాయి పట్టివేత..

**మొదటి పేజీ తరువాయి భాగం..**
తిరుగుతున్నట్లు ఎస్సై కృష్ణదేవ కు పక్కా సమాచారం అందగా కల్వకుర్తి సి.ఐ బి. నాగార్జున పర్య వేక్షణలో, ఎస్సై సిబ్బంది తనిఖీలు చేపట్టగా, పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించిన ఒడిస్సాకు చెందిన ఇద్దరు లిట్టు మాలిక్ (35),అభిమన్యు మాలిక్ (32)లను పట్టుకొని విచారించగా నిందితులు ఇద్దరూసూర్యలత స్పిన్నింగ్ మిల్లులో ఆపరేటర్లుగా పనిచేస్తున్నట్లు తెలిసింది.ఒడిస్సాలోతక్కువ ధరకు గంజాయి లభిస్తుండటంతో ఇక్కడ ఎక్కువ లాభాలకు విక్రయించాలని పథకం వేశారు.ఈ క్రమంలోఈనెల 23న ఒడిస్సాలోని తెడీ బజార్‌లో ఖిచాఖి అనే వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేసి, బస్సులో హైదరాబాద్ మీదుగా మిల్లుకు చేరుకున్నారు.నిందితుల నుంచి 2.390కిలోల గంజాయి విలువ సుమారు రూ.58,850ల వరకు ఉంటుందని అధికారులు తెలిపారు. వారి వద్ద నుండి రెండు సెల్ ఫోన్లను కూడా స్వాధీనం చేసుకున్నట్లు సీఐ పేర్కొన్నారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన ఊర్కొండ ఎస్ఐ పి. కృష్ణదేవ, కానిస్టేబుల్స్ హర్ష, తిరుపతయ్య, వెంకన్నలను జిల్లా ఎస్పీ అభినందించారని సీఐ పేర్కొన్నారు.